WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ /మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

Facebook.varadhi telangana

# విశ్వ వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews.com

సంపుటి : 1
సంచిక : 77
శుక్రవారం
22.11. 2024



## రాష్ట్రపతికి వీడ్కోలు

హైదరాబాద్, నవంబర్ 22 : రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రెండు రోజుల హైదరాబాద్ పర్యటన ముగిసింది. రెండు రోజులపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్రపతి తిరిగి రాజధాని ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సిఎస్ శాంతికుమారి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు.



## సన్నాలకు 500 బోనస్ విడుదల


03

రైతుల ఖాతల్లోకి నేరుగా జమ

## 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలు



తెలంగాణ గ్రూప్-2 పరీక్షల షెడ్యూల్ విడుదల 03



## ప్రాణం తీసిన తుపాకీ మోజు

- అమెరికాలో గన్ మిస్ ఫైర్
- హైదరాబాద్ యువకుడి మృతి

.. వివరాలు 3లో

- గ్రీన్ ఫార్మా సిటీలో రెడ్డీస్, ఎం ఎస్ ఎన్, అరబిందో, గ్లాండ్, హెటిరో,లారస్ కంపెనీల పెట్టుబడులు
- రూ.5,260 కోట్ల పెట్టుబడులు పెట్టనున్న సంస్థలు
- 12,490 మందికి ఉద్యోగాలు లభించే అవకాశం
- సచివాలయంలో సీఎంతో ఫార్మా ప్రతినిధులు భేటీ
- పరిశ్రమల ఏర్పాటుకు ఎంవోయూలపై సంతకాలు



# రేవంత్‌కు ధన్నుగా ఫార్మాలో పెట్టుబడులు

**హైదరాబాద్, నవంబర్ 22 :** హైదరాబాద్ మహానగరంలో విశ్వనగరంగా ఎదుగుతోంది. ఇప్పటికే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు భాగ్యనగరంలో పెట్టుబడులు పెట్టాయి. వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. మరికొన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్నాయి. తాజాగా.. హైదరాబాద్ ఫార్మాసిటీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్రంలోని ఐదు దిగ్గజ ఫార్మా కంపెనీలు ముందుకొచ్చాయి. డాక్టర్ రెడ్డీస్, అరబిందో, హెటిరో, ఎంఎస్ఎన్, లారస్ కంపెనీలు గ్రీన్ ఫార్మాసిటీలో పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ క్రమంలోనే దేశంలో పేరొందిన ఫార్మా కంపెనీలు హైదరాబాద్ మహానగరంలో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి.

మిగతా 3 లో



# స్పీకరే ఫైనల్!

అనర్హతపై తుది నిర్ణయం ఆయనదే!

- తగిన సమయంలో నిర్ణయం తీసుకునే అధికారం
- ఐదేళ్ల అసెంబ్లీ కాలం దృష్టిలో పెట్టుకోవాలని సూచన
- నాలుగు వారాల గడువు పెడుతూ ఇచ్చిన తీర్పు కొట్టివేత
- అనర్హత పిటిషన్‌పై హైకోర్టు సీజే ధర్మాసనం సంచలన తీర్పు

**హైదరాబాద్, నవంబర్ 22 :** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టేసింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు సూచించింది. నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌దేనని కూడా స్పష్టం చేసింది. 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ

మిగతా 3 లో

## రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు కురుస్తున్న మంచు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
- పిల్లలు. వృద్ధులు జాగ్రత్తగా ఉండాల్సిందే
- పొగ మంచు.. ఆలస్యంగా మార్నింగ్ వాక్
- వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



# పెరుగుతున్న చలి తీవ్రత

07

## అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకోవాలి



- కాంగ్రెస్ డబుల్ స్టాండర్డ్ వీడాలి
- ఒప్పందాలు రద్దు చేసుకునేలా రాహుల్ చర్య తీసుకోవాలి
- ఫిరాయింపులపై స్పీకర్ చర్య తీసుకోవాలి
- లేదంటే సుప్రీంను ఆశ్రయిస్తాం
- మీడియా సమావేశంలో కేటీఆర్

.. వివరాలు 2లో

## అదానీ గ్రూప్‌పై అభియోగాలను విచారిస్తున్న భారత సంతతి అధికారులు

02

## సమర్థంగా కేంద్ర పథకాల వినియోగం

కలెక్టరేట్‌లో దిశ సమావేశంలో కోమటిరెడ్డి సూచన



.. వివరాలు 2లో

## తలకాయ లేని సీఎం రేవంత్ రెడ్డి

- అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటైనది
- మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలంటున్న రైతులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు

2 లో..

## తెలంగాణలో అదానీకి ఇంచు భూమి ఇవ్వలేదు

- అదానీతో మోడీది ఆర్థిక బంధం
- అదానీని వెంటనే అరెస్ట్ చేయాలి
- ప్రధాని మోదీపైనా నిప్పులు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు



.. వివరాలు 2లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


# అదానీతో ఒప్పందాలు రద్దు చేసుకోవాలి



**హైదరాబాద్, నవంబర్ 22 :** పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలంతా రెండు నాలుకల ధోరణితో ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలపై తెలంగాణ బీజేపీ వైఖరి ఏంటో చెప్పాలి?. అదానీ వ్యవహారంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని మరోసారి రుజువైంది. అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా?. దీనిపై రాహుల్ గాంధీ జవాబు చెప్పాలన్నారు. అదానీ అవినీతిపరుడైతే సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో రాహుల్ గాంధీ చెప్పాలని అన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి. కెన్యా లాంటి చిన్న దేశాలే రద్దు చేసుకున్నప్పుడు రేవంత్ ఎందుకు రద్దు చేసుకోరు?. అదానీతో ఒప్పందాలపై పునరాలోచన చేయాలని ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి సైతం అన్నారు. ఈ అంశంలో షర్మిల సూచనలను ముఖ్యమంత్రి తీసుకోవాలి. మహారాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అన్న రేవంత్.. తెలంగాణలో మాత్రం గజమాల వేస్తున్నారు. స్కిల్ యూనివర్శిటీకి రూ.100 కోట్లు తీసుకోవడం తప్పా?.. కాదా?. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశమైన మాట వాస్తవం. ఆయనతో రేవంత్ సర్కార్ రద్దు ఒప్పందాలు చేసుకోవటం లేదు?. అదానీ వేల కోట్ల రూపాయల ఒప్పందాలపై రోజూ విమర్శించే రాహుల్ దీనికి సమాధానం చెప్పాలి. రాహుల్‌కి తెలిసే రేవంత్ రెడ్డి విరాళం తీసుకున్నారా?. జాతీయ పార్టీకి ఢిల్లీలో ఒక నీతి ఉంటే గల్లీలో మరొక నీతి ఉంది. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ అయితే కాంగ్రెస్ డబుల్ స్టాండర్డ్ పార్టీనా?.అని ప్రశ్నలు కురించారు. కేసీఆర్ హయాంలో ఎంత ప్రయత్నం చేసినా తెలంగాణలో అదానీకి అవకాశం ఇవ్వలేదు. ఆయనతో మేము ఫొటోలు దిగిన మాట వాస్తవం. అంతే మర్యాదగా బయటకు పంపించాం. రేవంత్ మాత్రం అదానీకి ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలికారు. అదానీతో చేసుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలి. బడే బాయ్ మోదీ ఆదేశాలను చోటా బాయ్ రేవంత్ అమలు చేశారు. తెలంగాణలో అదానీ వ్యాపార సామ్రాజ్య ఏర్పాటుకు ముఖ్యమంత్రి సహకారం అందిస్తున్నారు.

## ఫిరాయింపులపై స్పీకర్ చర్య తీసుకోవాలి

### లేదంటే సుప్రీంను ఆశ్రయిస్తాం: కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై శాసనసభాపతి నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. అనర్హత పిటిషన్ల విషయమై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని బెంచ్ తీర్పుపై ఆయన స్పందించారు. మొన్నటి వరకు సభాపతిని ఆదేశించే అధికారం కోర్టుకు లేదని వాదించారని కేటీఆర్ గుర్తు చేశారు. రీజనబుల్ పీరియడ్‌లో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సీజే స్పష్టం చేశారని, రీజనబుల్ పీరియడ్ అంటే మూడు నెలలు అని మణిపుర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

# అదానీతో మోడీది ఆర్థిక బంధం

- అదానీని వెంటనే అరెస్ట్ చేయాలి
- తెలంగాణలో అదానీకి ఇంచుభూమి ఇవ్వలేదు
- కేటీఆర్ వ్యాఖ్యలపై మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు



**హైదరాబాద్,నవంబర్22 :** దిగ్గజ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారం తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తోంది. అదానీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. అలాగే ప్రధాని మోదీపైనా నిప్పులు చెరిగారు. స్కిల్ యూనివర్శిటీకి అదానీ నుంచి తెలంగాణ సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అని కేటీఆర్ ప్రశ్నించడంపై మహేశ్ గౌడ్ స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి కేటీఆర్ విరాళం ఇచ్చినా తీసుకుంటామంటూ ఆయన చురకలు అంటించారు. అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేసినందున వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారు. ఆయన అవినీతిపై రాహుల్‌గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదు. అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారని అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని కోరారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశాం. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీఎంలను జైల్లో వేశారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీపై చర్యలేవని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. అదానీకి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఇంచు భూమి ఇవ్వలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తెలిపారు. నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని ఆయన తేల్చి చెప్పారు. అదానీ అరెస్టయితే ప్రధాని మోదీ రాజీనామా తప్పదని టీపీసీసీ చీఫ్ జోస్యం చెప్పారు. అదానీ ఆర్థిక నేరంలో మోదీకీ భాగస్వామ్యం ఉందంటూ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. అదానీని వెంటనే అరెస్టు చేయాలని, లంచం అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ అరెస్టయితే అనేక అంశాలు బయటకి వస్తాయని చెప్పుకొచ్చారు. మోదీ ప్రభుత్వంలో ఆయన వేల కోట్ల లబ్ధి పొందారని, అదానీ ఆగడాలపై రాహుల్ ఎన్నిసార్లు ప్రశ్నించినా మోదీ కనీసం స్పందించలేదని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. అర్హత లేకున్నా అదానీ రుణాలు పొందారని, ఆయన వల్ల ప్రజలపై పెను భారం పడిందని ఆగ్రహించారు. అనేక దేశాలనూ అదానీ మోసం చేశారంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. కెన్యా దేశం మాదిరిగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. అదానీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ.. ఢిల్లీలో ఒకలా తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. అదానీ అవినీతిపరుడు అయినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్శిటీకి అదానీ నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అంటూ ప్రశ్నించారు. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశం నిజం కాదా అంటూ ధ్వజమెత్తారు. అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా అంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలు వెంటనే రద్దు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహారాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అని చెప్పిన రేవంత్.. తెలంగాణలో మాత్రం ఆయనకు గజమాల వేశారంటూ ధ్వజమెత్తారు.

## గడపగడపకు చేరేలా
# కార్యక్రమాలు

**ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం**

**7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాల్లో కార్నివాల్**

**అధికారులతో సమీక్షలో డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, నవంబర్ 22 :** ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాలు గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా పాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని సూచించింది. అన్ని శాఖల అధికారులు ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు జరపాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా నెల 30న మహబూబ్ నగర్‌లో రైతు దినోత్సవం సభ డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంకల్పించారు. పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పలు సూచనలు చేశారు. మావేశానికి మంత్రులు ఉత్త మ్ , పొంగులేటి, సీతక్క, ప్రభుత్వ సలహాదారులు హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా, ఈ సంవత్సర కాలంలో చేపట్టిన విప్లవాత్మక పథకాల అమలు, కార్యక్రమాలను రాష్ట్రంలోని ప్రతి గడప గడపకు చెర వేసేలా విస్తృత స్థాయిలో కార్యక్రమాలను చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నేడు సాయంత్రం సచివాలయంలో సమావేశమైంది. రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ– సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ శాఖల కార్యదర్శులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం సందర్భంగా ప్రజా విజయోత్సవాలు ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్.బీ స్టేడియంలో పాఠశాల విద్యార్థుల దినోత్సవం, వరంగల్ లో మహిళా దినోత్సవం కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని, అదేవిధంగా ఈనెల 30 వ తేదీన మహబూబ్‌నగర్‌లో రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్టు వివరించారు. అదేవిధంగా డిసెంబర్ 7, 8, 9 తేదీలలో హైదరాబాద్ ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ మార్గాలలో కన్నుల పండగగా కార్నివాల్, లేజర్ షో, పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మూడు రోజుల ఉత్సవాలలో మహిళలు, పిల్లలు, పౌరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే, ప్రతీ జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విజయవంతంగా జరుగుతున్నాయని, అదేవిధంగా ప్రతీ గ్రామ స్థాయి నుండి, మండలాలు, జిల్లా స్థాయి వరకు ఈ ప్రజా విజయోత్సవాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని తెలియచేసారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న దాదాపు 70 లక్షల స్వయం సహాయక మహిళలకు సున్నా వడ్డీ పథకం, బ్యాంకు లింకేజీలు, సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ తదితర మహిళా సాధికారత పథకాల వివరాలన్నీ వారికి చేరవేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ విజయాలపై ప్రత్యేకంగా రూపొందించిన హోర్డింగులు, షార్ట్ ఫిలిం లు, తదితర ప్రచార అంశాలను హోర్డింగులు, ప్రకటనలు, సోషల్ మీడియాలా ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ ప్రజా విజయోత్సవాలు పురస్కరించుకొని రాష్ట్రంలో నర్సింగ్, పారా మెడికల్ కళాశాలల ప్రారంభోత్సవం, 200 విధ్యుత్ సబ్ స్టేషన్ల ప్రారంభం, 9007 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందచేయడం, ఆరు ప్రధాన పాలసీలను ముఖ్యమంత్రి గారిచే ప్రారంభించుకోవడం తదితర కార్యక్రమాలను కూడా చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్బంగా ఈ ప్రజా విజయోత్సవాలా నిర్వహణపై వివిధ శాఖల కార్యదర్శుల సలహాలు, సూచనలను డిప్యూటీ సి.ఎం స్వీకరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, శైలజా రామయ్యర్, శ్రీధర్, క్రిస్టినా జోంగ్తు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవీ గుప్తా, హైదరాబాద్, సైబరాబాద్ నగర పోలీస్ కమిషనర్లు సి.వీ ఆనంద్, మోహంతి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హరీష్, ÷ర్పైర్వీసుల డీజీ నాగి రెడ్డి, సి.ఎం. ఓ అధికారులు షా నవాజ్ కాసీం, మాణిక్ రాజ్, శ్రీనివాసులు, శ్రీరామ్ కర్రీ వివిధ శాఖల కార్యదర్శులు ఉన్నతాధికారులు హాజరయారు.

# సమర్ధంగా కేంద్ర పథకాల వినియోగం

**కలెక్టరేట్‌లో దిశ సమావేశంలో కోమటిరెడ్డి సూచన**



**నల్లగొండ, నవంబర్ 22 :** కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కేంద్ర విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి స్థానిక ఎంపీ రఘువీర్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. కేంద్ర పథకాల అమలుకు సంబంధించి తన ఎంపీ అనుభవాలను సభ్యులతో పంచుకుంటూ, వాటిని ఎఫెక్టివ్‌గా అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతీ జిల్లాలో దిశ కమిటీలను ఏర్పాటు చేసి, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు అవసరమైన సమన్వయం అందిస్తోందని మంత్రి తెలిపారు. తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి నల్లగొండ జిల్లాలో అమలవుతున్న పథకాలపై సమీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, వేముల వీరేశం, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# రైతుల భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు వద్దు

**సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

**హైదరాబాద్, నవంబర్ 22 :** రైతుల పంటలు పండించే భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుంది. గిరిజనుల భూములు వారికే ప్రభుత్వం అప్పగించి ఫార్మాసిటీని జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. లగచర్ల ఫార్మాసిటీని ఫోర్త్ సిటీగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.2 లక్షల పైన పంట రుణమాఫీ పై కాంగ్రెస్ ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని, వీటిపై ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఏం చేసిందని, మరో నాలుగేండ్లలో ఏమి చేస్తారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గడప మల్లేశ్, దయానంద్,జనార్దన్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# తలకాయ లేని సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 22 :** హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందని చెప్పిన తలకాయ లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడడం.. అబద్దాలు చెప్పడం ముఖ్యమంత్రికి అలవాటు అయిపోయిందని మండిపడ్డారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. గ్యారెంటీలు అమలు చేయనందుకు ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి. కరోనా కష్టకాలంలో కూడా మంత్రుల ఎమ్మెల్యేల జీతాలు బందు పెట్టి రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం. రూ. 15000 రైతుబంధు ఇస్తామని చెప్పి ఉన్న రూ. 10000 కూడా ఎగ్గొట్టిండు రేవంత్ రెడ్డి. ఇది ఏంటి అని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం. ప్రతిపక్షాల గొంతు నొక్కడం వంటివి చేస్తున్నాడు. ఇగురం లేనోడు వ్యవసాయం చేస్తే వడ్లు వాగులో గడ్డి గాళ్ళలో కొట్టుకుపోయింది అంట. ఈ రేవంత్ రెడ్డి పాలన ఇట్లనే ఉన్నది. అందుకే నువ్వు ఎనుముల రేవంత్ రెడ్డి కాదు ఎగవేతల రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అదానీ గురించి ఢిల్లీ కాంగ్రెస్ ఒక మాట గల్లీ కాంగ్రెస్ ఒక్క మాట. రాహుల్ గాంధీ ఏమో అదానీని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. అదానీ నుండి రూ. 100 కోట్ల చెక్కు తీసుకున్న రేవంత్ రెడ్డిని ఏం చేయాలో రాహుల్ గాంధీ చెప్పాలి. అంతర్గత ఒప్పందాలతో కాంగ్రెస్ పార్టీ డ్రామాలు చేస్తున్నది. కేసీఆర్ ఉన్నప్పుడు అదానీ అనేవాడు తెలంగాణకు రాగలిగాడా? ఒక రూపాయి అయినా తెలంగాణలో పెట్టుబడి పెట్టగలిగాడా? అవినీతి ఆరోపణలతో అమెరికాలో అదానీని అరెస్టు చేయాలని చూస్తున్నారు. అలాంటి అదానీతో లోపాయికారీ ఒప్పందం చేసుకుంది రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం మార్కెట్ యార్డులో వెళ్ళినప్పుడు రైతులందరూ కళ్ళల్లో నీళ్లు పెట్టుకుని బాధపడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని దేవుని మీద ఒట్టు పెట్టి మోసం చేసిండు రేవంత్ రెడ్డి. ఏ ముఖ్యమంత్రి అయినా దేవుడి మీద ఒట్టు పెట్టి మాట తప్పుతారా? పాలకులు పాపం చేస్తే ప్రజలకు నష్టం జరుగుతుందని అయ్యగారు చెప్తే నేను దేవాలయాలకు వెళ్ళాను. రేవంత్ రెడ్డి పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తానని ఒట్టు పెట్టి మోసం చేశాడని పాపపరిహారం చేశాను. అయితే తిట్లు లేదంటే దేవుని మీద ఓట్లు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి మద్యం అమ్మకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, కానీ పత్తి వరి కొనుగోళ్లపై సమీక్ష చేయడం లేదు. మద్దతు ధరకు ధాన్యం కొనకపోతే, ఎవరికి మెమోలు జారీ చేయడం లేదు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా చేయాలని ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారేమో. ఈరోజు పత్తి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. పత్తిని రూ.7,500కు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు తెలిపారు.



www.varadhinews.com
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

# స్పీకర్ నిర్ణయమే ఫైనల్!

మొదటి పేజీ తరువాయి

గడువును దృష్టిలో ఉంచుకొని స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. భారాస తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ భారాస ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటితోపాటు దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. అనర్హత పిటిషన్‌లను స్పీకర్ స్వీకరించకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. సెప్టెంబరు 9న దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. 4 వారాల్లో అనర్హత పిటిషన్‌లపై షెడ్యూలు ఖరారు చేయాలని తీర్పు వెలువరించారు. సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో అసెంబ్లీ కార్యదర్శి వి. నరసింహాచార్యులు దాఖలు చేసిన అప్పీళ్లపై ఇటీవల వాదనలు ముగియగా, తీర్పును వాయిదా వేసింది. తాజాగా స్పీకర్ తీసుకోవాలంటూ శుక్రవారం ఉన్నత న్యాయస్థానం తీర్పును వెలువరించింది. దీంతో జంపింగ్ జంపాగ్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రేమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్‌కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్‌పై హైకోర్టు తీర్పు ప్రకటించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంజ్ స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఏలాంటి నిర్దుష్ట సమయం అంటూ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. తగిన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేవేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సీజే ధర్మాసనం సూచించింది

# సన్నాలకు 500 బోనస్ విడుదల



**హైదరాబాద్, నవంబర్ 22 :** సన్నాలు పండించిన అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రైతుల ఖాతాల్లో క్వింటాకు రూ. 500 చొప్పున బోనస్ డబ్బులు జమవుతున్నాయి. శుక్రవారం పలు జిల్లాల రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమయ్యాయి. ఇందుకు సంబంధించిన మెస్సేజ్ లు రైతుల మె-ుబైల్ ఫోన్లకు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇస్తామని ప్రకటించడంతో సన్న రకాల ధాన్యం మార్కెట్లోకి పోటెత్తుతోంది. ఈ వానాకాలం సీజన్?లో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. గతానికి భిన్నంగా దొడ్డు రకాల సాగు తగ్గి, సన్నాల సాగు పెరిగింది. సన్నాలకు సర్కార్ రూ.500 బోనస్ ప్రకటించడంతో వీటి సాగు గతంతో పోలిస్తే ఏకంగా 61శాతం పెరిగింది. పోయినేడు వానాకాలంలో వరి సాగు విస్తీర్ణంలో సన్నాల వాటా 25.05 లక్షల ఎకరాలు ఉంటే.. ఈసారి అది 40.44 లక్షల ఎకరాలకు పెరిగింది. గత ఏడాది వానాకా లంలో 40.89 లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లు సాగైతే, ఈసారి అది 26.33 లక్షల ఎకరాలకు తగ్గింది. సాగు గణనీయంగా పెరగడంతో దిగుబడిలోనూ సన్న ధాన్యం రికార్డులు సృష్టిస్తోంది. ఈ యేడు సన్న వడ్ల దిగుబడి దాదాపు 93.33 లక్షల టన్నులు ఉంటుందని సర్కారు అంచనా వేసింది. దీంతో రాష్ట్రంలో ఇప్పుడు ఏ మిల్లు చూసినా, ఏ కొనుగోలు సెంటర్ చూసినా సన్న వడ్ల రాసులే కనిపిస్తున్నాయి. సన్నవడ్ల కొనుగోలు కోసం ప్రభు త్వం 7,500 సెంటర్లు ఏర్పాటు చేసింది సర్కార్. కనీస మద్దతు ధరతో పాటు అదనంగా బోనస్ ఇస్తోంది ప్రభుత్వం. ఖాతాల్లో ధాన్యం సొమ్ముతో పాటు బోనస్ కూడా జమ అవుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇవాళ పలువురు రైతులకు సన్నాల బోనస్ మెస్సేజ్ లు వచ్చాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల కు చెందిన ఓ రైతు 46 క్వింటాళ్ల 800 గ్రాముల ధాన్యం విక్రయించగా.. 23,400 రూపాయల బోనస్ మొత్తం తెలంగాణ గ్రామీణ బ్యాంకులోని ఆయన ఖాతాలో జమైనట్లు మెస్సేజ్ వచ్చింది. బాదావత్ నరేశ్, హోతియా తండా, కూసుమంచి మండలం, ఖమ్మం జిల్లా నామూడెకరాల్లో పండిన వడ్లను పాలేరు ఐకేపీ సెంటర్ లో మూడు రోజుల కిందట కాంటా వేశారు. 59 క్వింటాళ్ల 20 కేజీలు అయ్యాయి. వాటికి సంబంధించిన డబ్బులు లక్షా 37 వేల 344లు వచ్చాయి. కనీస మద్దతు ధర 2,320 చొప్పున కొనుగోలు చేశారు. ఈ డబ్బులను నా ఖాతాలో ప్రభుత్వం వేసింది. వడ్లకు సంబంధించిన బోనస్ కూడా నిన్న సాయంత్ర మా ఖాతాల్లో వేసింది. నాకు 29,600 బోనస్ సొమ్ము వచ్చాయి..

# ఇన్ఫార్మర్ నెపంతో అన్నదమ్ముల దారుణ హత్య

## ములుగు జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం

**ములుగు, నవంబర్ 22 :** ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. ఇన్ ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు ఇద్దరు అన్నదమ్ములను దారుణ హత్య చేశారు. వాళ్లిద్దరినీ గొడ్డళ్లతో నరికి చంపడంతో పాటు సీపీఐ మావోయిస్టు పార్టీ వెంకటాపురం%-% వాజేండు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు.ములుగు జిల్లాలో మావోయిస్టులు రెచ్చిపోయారు. ఇన్‌ఫార్మర్‌ల పేరుతో అన్నదమ్ములను నరికి చంపారు. అన్నదమ్ములు ఇద్దరినీ దారుణంగా హతమార్చడంతో ములుగు జిల్లాలో ఒక్కసారిగా భీకర వాతావరణం నెలకొంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పెనుగోలు కాలనీలో ఉంటున్న ఉయిక రమేశ్ పేరూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండేవాడు. అతని తమ్ముడు ఉయిక అర్జున్ స్థానికంగా పశువులను మేపుకుంటూ ఉండేవాడు. కాగా ఉయిక అర్జున్ కొద్దిరోజులుగా ఇన్ ఫార్మర్ గా మారి పోలీసులకు సమాచారం చేర వేస్తున్నట్లు మావోయిస్టులు అనుమానించారు. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి కొంతమంది మావోయిస్టులు గ్రామంలోకి చొరబడి ఉయిక రమేష్ తో పాటు ఉయిక అర్జున్ ను వేట గొడ్డళ్లతో దారుణంగా హత్య చేశారు. దీంతో ములుగు జిల్లాలో కలకలం చెల రేగింది. విషయం తెలుసుకున్న పోలీసు వర్గాల్లో కూడా అలజడి మొదలైంది. అన్నదమ్ములను హత్య చేసిన అనంతరం భారత కమ్యూనిస్ట్ మావోయిస్ట్ పార్టీ వెంకటాపురం వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరున లేఖ కూడా రిలీజ్ చేశారు. దాని సారాంశం ప్రకారం.. ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన ఉయికె అర్జున్ గ్రామంలో ఉంటూ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారాడు. అతను వాజేడు మండలంలో ఉంటున్నాడు.అతను షికారు పేరుతో చేపల వేటతో పాటు పశువులను మేపే పేరుతో అడవికి వెళ్లి అంతా తిరిగేవాడు. అక్కడ మావోయిస్టుల దళం మకాంలు, కదలికలు గమనించి స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తున్నట్టు మావోయిస్టు పార్టీ నేతలకు అనుమానం కలిగింది. దీంతో పద్ధతి మార్చుకోవాల్సిందిగా చెప్పినా వినడం లేదని పేర్కొంటూ.. అదే కారణంతో ఉయికె అర్జున్ ను ఖతం చేస్తున్నాం అంటూ లేఖలో పేర్కొన్నారు. ఉయికె అర్జున్ ను హతమార్చేందుకు మావోయిస్టులు అతడిని తీసుకెళ్లగా.. అడ్డుకునేందుకు వెళ్లిన అన్న రమేష్ ను కూడా మావోలు గొడ్డలి వేటుతో హత మార్చారని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇద్దరు అన్నదమ్ముల హత్యతో ములుగు జిల్లా మరోసారి ఉలిక్కిపడగా.. పోలీసులు అలర్ట్ అయ్యారు. గ్రామంలో పోలీసులు మోహరించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. స్థానికులు ఎవరూ భయాందోళనకు గురి కావొద్దని సూచిస్తున్నారు.

## అదానీ గ్రూప్‌పై అభియోగాలను విచారిస్తున్న

# భారత సంతతి అధికారులు

**హైదరాబాద్, నవంబర్ 22 :** భారత బిలియనీర్ గౌతమ్ అదానీ, ఆయన సమీప బంధువు సాగర్ అదానీ, అదానీ గ్రూప్‌నకు చెందిన ఇతర ఎగ్జిక్యూటివ్‌లపై లంచం ఇచ్చారనే ఆరోపణలపై అమెరికాలో దర్యాప్తు జరుగుతోంది. ఈ దర్యాప్తులో యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం యాక్టింగ్ డైరెక్టర్ సంజయ్ వాధ్వా కీలక పాత్ర పోషిస్తున్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో తమకు అనుకూలంగా వ్యవహరించడానికి భారత ప్రభుత్వ ఉన్నతాధికారులకు సుమారు రూ.2,100 కోట్ల మేర లంచం ఇచ్చినట్టు అదానీ ప్రతినిధులపై హైప్రొఫైల్ లంచం ఆరోపణలు కేంద్రీకృతమయ్యాయి. వైట్ హౌజ్ స్పందించేవరకు వెళ్లిన ఈ అభియోగాలపై దర్యాప్తును సంజయ్ వాధ్వా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అభియో గాలు ఏంటి? గౌతమ్ అదానీ , సాగర్ అదానీ ఒక ఆఫర్ ప్రక్రియ ద్వారా అదానీ గ్రీన్ బాండ్లను కొనుగోలు చేయ డానికి యుఎస్ పెట్టుబడిదారులను ప్రేరేపించారు. అదానీ గ్రీన్ ప్రాజెక్ట్ భారత్ లో విజయవంతం అవుతుం దని, అందుకు వీలుగా ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు పెద్ద ఎత్తున లంచాలను ఇచ్చామని వారు యుఎస్ పెట్టుబడిదారులకు చెప్పారు. ఇది అమెరికాలో సెక్యూరిటీ నిబంధనల ఉల్లంఘన అని యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ స్పష్టం చేసింది. సంజయ్ వాధ్వా ఫ్లోరిడా అట్లాంటిక్ విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి టాక్సేషన్ లో మాస్టర్ ఆఫ్ లాస్ పట్టా పొందారు. అదనంగా, అతను టెక్సాస్ సౌత్ కాలేజ్ ఆఫ్ లా హ్యూస్టన్ నుండి జ్యూరిస్ డాక్టర్ డిగ్రీని పొందా డు. అతని వృత్తిపరమైన ప్రయాణం 1996లో కాహిల్ గోర్డాన్ రీనెల్ ఎల్ఎల్పిలో టాక్స్ అసోసియేట్ గా ప్రారంభమైంది. 2000లో, అతను స్కాడెన్, ఆర్ప్స్, స్లేట్, మీఘర్ ఫ్లోమ్ ఎల్ఎల్పి మరియు అఫిలియేట్స్ లో చేరాడు, పన్ను చట్టంలో అతనిది స్పెషలైజేషన్. వాధ్వా 2003లో ఎస్ఈసీ ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో స్టాఫ్ అటార్నీగా చేరా రు. రెండు దశాబ్దాలకు పైగా బ్రాంచ్ చీఫ్, అసిస్టెంట్ డైరె క్టర్, మార్కెట్ అబ్యూస్ యూనిట్ డిప్యూటీ చీఫ్ వంటి కీల క బాధ్యతలు నిర్వర్తించారు.

## రేవంత్‌కు ధన్నుగా

# ఫార్మాలో పెట్టుబడులు

మొదటి పేజీ తరువాయి

తమ కంపెనీల కార్యకలాపాల విస్తరణతో పాటు కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం(నవంబర్ 22) రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్?బాబుతో సమావేశమయ్యారు. ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ.5,260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే ప్రభుత్వం గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాన్ని కేటాయించనుంది.ఎంవోయూల ఒప్పందాల ప్రకారం ఎంఎస్ఎన్ లాబోరేటరీ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ పార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్బన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్ ఏర్పాటు చేస్తుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిషిడ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కంపెనీలు ఫార్మా సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రెడీ కాగా.. పరిశ్రమల స్థాపనకు తమ ప్రభుత్వం అనుకూల వాతావరణం సృష్టిస్తుందని మంత్రి తెలిపారు.

# ప్రాణాలు పోయినా భూములివ్వం..

## కందుకూరు, కొడంగల్‌లో తిరగబడ్డ రైతులు



**హైదరాబాద్, నవంబర్ 22 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నికంకుశంగా వ్యవహరిస్తున్నది. భూసేకరణ పేరుతో నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా రైతుల భూములను లాక్కుంటు న్నది. ఫార్మా సిటీ పేరిట లగచర్ల రైతులు తిరగబడిన ఘటన మ-రువకముందే తాజాగా రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, కొంగరకలాన్‌లో మరోసారి రైతులు తిరగబడ్డారు. ప్రాణం పోయినా ఫ్యూచర్ సిటీకి మా భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. భూములు ఇచ్చే ప్రసక్తే లేదంటూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. భారీ ఎత్తున పోలీసులను మోహరించి సర్వే పనులు చేపపడుతున్నారు.కాగా,30 వేల ఎకరాల్లో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నది. హైదరాబాద్ నగర శివార్లలో నిర్మించాలని తలపెట్టిన ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా 16 వేల ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం ది. ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. దీనికి అదనంగా 16 వేల ఎకరాలకు పైగా భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని సర్కారు నిర్ణయించింది. అంటే మొత్తం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది. ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా16 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరించనున్నారు.

## డిసెంబర్ 15, 16 తేదీల్లో


# గ్రూప్-2 పరీక్షలు

## తెలంగాణ గ్రూప్-2 పరీక్షల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, నవంబర్ 22 :** తెలంగాణ గ్రూప్ 2 పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో 783 గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ కోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైంది. డిసెంబర్ 9వ తేదీ నుంచి హాల్ టిక్కెట్‌లో కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. డిసెంబర్ 15,16 తేదీల్లో పరీక్షల్ని నిర్వహిస్తారు.తెలంగాణ గ్రూప్-2 రాత పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. డిసెంబర్ 9వ తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ మేరకు పరీక్షల టైం టేబుల్ టీజీపీఎస్సీ విడుదల చేసింది.తెలంగాణలో 783 గ్రూప్-2 పోస్టుల భర్తీకి డిసెంబరు 15, 16 తేదీల్లో రాత పరీక్షలు జరుగుతాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. గ్రూప్ 2 హాల్ టికెట్లు డిసెంబరు 9 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయనికమిషన్ పేర్కొంది. తెలంగాణ గ్రూప్ 2 పరీక్షల టైంటేబుల్, సూచనలతో కూడిన వివరాలను వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ప్రతి పేపరులో 150 ప్రశ్నలుంటాయి. 150 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

# ప్రాణం తీసిన తుపాకీ మోజు

## అమెరికాలో గన్ మిస్ ఫైర్ ● హైదరాబాద్ యువకుడి మృతి



**హైదరాబాద్, నవంబర్ 22 :** మరో భారతీయుడు అమెరికాలో మృతిచెందాడు. గన్ మిస్‌ఫైర్ కావడంతో ఈ ఘటన జరిగింది. అమెరికాలోని జార్జియా రా ష్ట్రంలోని అట్లాంటాలో తెలంగాణలోని ఉప్పల్‌కు చెందిన విద్యార్థి అరుణ్ రెడ్డి(23) ఉంటున్నాడు. నవంబర్ 13న అతని పుట్టిన రోజు. అదే రోజు అతను తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్ శుభ్రం చేస్తుండగా మిస్ ఫైర్ అయిం ది. ఈ ఘటనలో అరుణ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ వార్త తెలుసు కున్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒక్కగానొక్క కొడుకు తిరిగి రాడనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. బీబీనగర్ పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన వ్యాపారి పాల్వాయి సుదర్శన్‌రెడ్డి దీప దంపతులు ఉప్పల్ బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి ఒక్కగానొ క్క కొడుకు అరుణ్‌రెడ్డి(24) ఉన్నాడు. గతేడాది డిసెంబర్‌లో అమెరి కాలోని జార్జియా స్టేట్ అట్లాంటా పట్టణంలోని కెనిస్వా యూనివర్సిటీలో ఎంఎస్ చదివేందుకు వెళ్లాడు. నవంబర్ 13న తన స్నేహితుల మధ్యనే పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నాడు. తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ఆరుణ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అదే రోజు ఉదయం 10 గంటలకు తన హంటింగ్ లైసెన్స్‌డ్ గన్‌ను శుభ్రం చేయడం ప్రారంభించాడు. ఈ సమయంలో మిస్‌ఫైర్ అయింది. దీంతో తూటా అరుణ్ ఛాతీలో నుంచి దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

# చెరువుల ఆక్రమణలపై హైడ్రా దృష్టి

## ● అధికారులతో కీలక సమావేశం నిర్వహించిన రంగనాథ్



**హైదరాబాద్, నవంబర్ 22 :** ఇకపై చెరువులు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్‌ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ఈఎన్సీలు, ఇరిగేషన్ సీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు. ‘ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్‌ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్‌ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐఏఎస్‌లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్‌ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివిసీమ ఉప్పెన వచ్చినప్పుడు 10వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు. ‘ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి..దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషినల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్స్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీలో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాలి. వర్షాలు పడుతున్నపుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది..హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్ కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. నేను మెకానికల్ ఇంజనీర్‌ని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

సారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

# రేవంత్ వర్సెస్ కేటీఆర్ చుట్టూ తెలంగాణ రాజకీయం

తెలంగాణ రాజకీయం గత కొద్దిరోజులుగా రేవంత్ వర్సెస్ కేటీఆర్గా నడుస్తోంది. ఓవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, అసమర్థ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని కాంగ్రెస్ ఆరోపిస్తుంటే.. అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా సీఎం రేవంత్కు పాలన చేతకావడంలేదని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ టార్గెట్ చేయగా.. కేటీఆర్ను కాంగ్రెస్ టార్గెట్ చేస్తోంది. రెండు పార్టీల కంటే ఇద్దరు వ్యక్తుల మధ్య వార్గా తెలంగాణ రాజకీయా ల్లో గత కొద్దిరోజులుగా కనిపిస్తోంది. ఈ నేపథ్యం లో కేటీఆర్ ఊచలు లెక్కపెట్టాల్సి వస్తోందంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. భారత రాష్ట్ర సమితి రాజకీయ వ్యూహం పక్కా ప్లాన్ ప్రకారం వెళ్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కన్నా రేవంత్ రెడ్డినే ఎక్కువ టార్గెట్ చేస్తోంది. ఒక్కో సారి కాంగ్రెస్ పార్టీని రేవంత్ నాశనం చేస్తున్నారని రాహుల్ కు చెబుతున్నారు కేటీఆర్. గాంధీభవన్ లో గాడ్సే అని.. గాడ్సే శిష్యుడు రేవంత్ అని తాజాగా కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని ప్రత్యేకంగా బలహీనం చేయాల్సిన పని లేదు..రేవంత్ ను బలహీనం చేస్తే చాలని బీఆర్ఎస్ భావిస్తోంది. హైకమాండ్ వద్ద రేవంత్ పలుకుబడి తగ్గించగలిగితే..ఆయన పనైపోయినట్లేనని తమ పని సులువు అవుతుందని అనుకుంటున్నారు. కేసీఆర్కు ఎదురు లేదు అనుకున్న రోజుల్లో.. ఆయనకు పోటీగా ఉన్న నేత దరిదాపుల్లో లేరు. అయితే కింది స్థాయి నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి పదేళ్లలోనే సీన్ మార్చేశారు. కేసీఆర్ కు తానే ధీటైన నేత అని నిరూపించారు. దీంతో ప్రజలు ఆయన వైపు మొగ్గారు. కేసీఆర్ ని గద్దె దించి సీఎం పీఠం అయన ఎక్కారు. ఒక వేళ రేవంత్ కాకపోతే కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్ కు ధీటైన నేత ఎవరూ లేరన్న అభిప్రాయం ఉండేది. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోవడానికి అదే కారణమని 2023లో గెలవడానికి కేసీఆర్ ధీటైన నాయకత్వం ఉండటమే కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతారు. రేవంత్ రెడ్డి ఇంకా యాభైల్లోనే ఉన్న






నాయకుడు. ఆయన ఇప్పుడు సీఎంగా స్థిరపడిపోతే తెలంగాణలో ఆయనకు మించిన లీడర్ ఉండరు. ఈ విషయం రాజకీయాల్లో పండిపోయిన బీఆర్ఎస్ అధినేతకు తెలియనిది కాదు. ప్రస్తుతానికి రేవంత్ కు ఉన్న పవర్ హైకమాండ్ వద్ద ఉన్న పలుకుబడితో ముడిపడి ఉంది. ఆయనను హైకమాండ్ వద్ద బలహీనపరిస్తే ఆటోమేటిక్ గా తెలంగాణలోనూ బలహీనమవుతారని అప్పుడు కాంగ్రెస్ కూ దిక్కుండనది బీఆర్ఎస్ పెద్దలు ఆలోచిస్తున్నారు. అందుకే ఏకపక్షంగా రేవంత్ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారు. ఆయనతో పాటు కొడంగల్ నియోజకవర్గాన్ని సోదరుని తరపున చూసుకుంటున్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డిపైనా ఆరోపణలు చేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులపై పదే పదే ఆరోపణలు చేస్తున్నారు. విషయం ఉన్నా లేకపోయినా దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు చేసి ఏదో జరుగుతోందన్న అభిప్రాయం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ వ్యూహం రేవంత్ రెడ్డి కి అర్థమై ఉంటుంది. కాంగ్రెస్ పార్టీని కాదని తనను టార్గెట్ చేస్తున్నారని.. తన కుటుంబాన్ని టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీని దెబ్బకొట్టాలని అనుకుంటున్నారని ఆయనకు సులువుగానే అర్థమైపోయి ఉంటుంది. అందుకే విజయోత్సవ సభల్లో రేవంత్ కేసీఆర్ పై తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. తాను బీఆర్ఎస్ ను తొక్కకుంటూ వచ్చానని మరోసారి మొలకెత్త నీయనని హెచ్చరికలు జారీ చేశారు. అంటే.. తెలంగాణ రాజకీయం రేవంత్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారడం స్పష్టమైంది. ఐతే, బీఆర్ఎస్కు అర్థంకాని విషయం ఏమిటంటే..ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం మునపటిలా బలంగా లేదు. పైగా, రేవంత్ని దించేస్తే. ఆ స్థాయి ప్రజాకర్షణ కలిగిన నేత ఎవరు? ఈ ప్రశ్నకు కాంగ్రెస్ అధిష్టానం దగ్గర సమాధానం లేదు..అదే రేవంత్ బలం..బీఆర్ఎస్కు ఇప్పటికే ఈ విషయం అర్థం కావాలి.

# ఉన్నత విద్యలో యువతుల హవా

**అమరావతి, నవంబర్ 22 :** ఉన్నత విద్యలో యువతులు ఆధిపత్యం సాధిస్తున్నారు. దేశంలో తొలిసారిగా యువకుల కంటే యువతుల అధిక సంఖ్యలో ఉన్నత విద్యా కోర్సుల్లో చేరుతున్నారు. ఉన్నత విద్యా సంస్థల్లో చేరికలను సూచించే గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (జీఈఆర్)లో 2017-18 నుంచి యువకులను య-ువతులు అధిగవి?ంచారు. యువకుల జీఈఆర్ 28.4శాతం ఉండగా.. యువతుల జీఈఆర్ 28.5శాతంగా నమోదైంది. 2017-22 మధ్య ఐదేళ్లలో ఉన్నత విద్యా రంగంలో వచ్చిన విశేష మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం కనబరుస్తోందని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)-డెలాయిట్ సంయుక్త అధ్యయన నివేదిక- 2024 వెల్లడించింది. సీఐఐ-డెలాయిట్ సంయుక్తంగా 2017-22 మధ్య కాలంలో దేశ ఉన్నత విద్యా రంగం తీరుతెన్నులను విశ్లేషించాయి.



**నివేదికలోని ప్రధాన అంశాలు...**

- దేశంలో ఉన్నత విద్యను అందించే కాలేజీల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2017లో దేశంలో 39,050 కాలేజీలు ఉండగా 2022 నాటికి 42,825కు పెరిగాయి.
- ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవేశాన్ని సూచించే 'గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో(జీఈఆర్) చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగింది. 2017-18లో జీఈఆర్ 24.6శాతం ఉండగా... 2021?22 నాటికి 28.4శాతానికి పెరగడం విశేషం.
- ఉన్నత విద్యా సంస్థల్లో యువతుల జీఈఆర్ కూడా పెరగడం సానుకూల పరిణామం. యువతుల జీఈఆర్ 2017-18లో 25.6శాతం ఉండగా 2021-22నాటికి 28.5శాతానికి పెరిగింది.
- ఉన్నత విద్యా సంస్థల్లో యువకుల జీఈఆర్ 2017-18లో 24.6శాతం ఉండగా, 2021-22నాటికి 28.4 శాతానికి చేరింది. ఈ ఐదేళ్లలోను యువతుల జీఈఆర్ అధికంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.
- ఉన్నత విద్యా సంస్థల్లో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి కూడా క్రమంగా తగ్గుతోంది. ఐదేళ్లలో ఉన్నత విద్యా రంగంలో అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయడంతో ఇది సాధ్యపడింది. 2017-18లో 25 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండగా... 2021-22 నాటికి 23 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉన్నారు.
- ఇక దేశంలో ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా పెరిగాయి. 2017-18లో దేశంలో మొత్తం 1,61,412 మంది పీహెచ్డీ కోర్సుల్లో చేరారు. 2021-22లో ఏకంగా 2,12,522 మంది పీహెచ్డీ కోసం ఎన్రోల్ చేసుకోవడం విశేషం.
- పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2017-18లో 29.40 లక్షల మంది విద్యార్థులు చేరగా... 2021-22
- విద్యా సంవత్సరంలో 37.50 లక్షల మంది విద్యార్థులు చేరారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో 2017-18లో 2.64 కోట్ల మంది విద్యార్థులు చేరగా, 2021-22 విద్యా సంవత్సరంలో 3.07కోట్ల మంది ప్రవేశంపొందారు.

# ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం

## వర్క్ ఫ్రమ్ హోమ్లో ఉద్యోగులు


**న్యూఢిల్లీ, నవంబర్ 22 :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీల సెల్సియస్గా నమోదయ్యాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 373తో చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. నగరంలోని మొత్తం 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదింటిలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన కేటగిరీలో నమోదయ్యాయి. ఆనంద్ విహార్, బవానా, జహంగీర్పురి, ముండ్కా, నెహ్రూ నగర్, షాదీపూర్, సోనియా విహార్, వివేక్ విహార్, వజీర్పూర్లో గాలి నాణ్యత సూచీ చాలా అధ్వానంగా ఉంది. ఈ స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువే నమోదైంది. తీవ్ర వాయుకాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను నివేదిస్తున్నారు. ఉదయం 8:30 గంటలకు నగరంలో తేమ స్థాయిలు 97 శాతంగా ఉన్నాయి. రోజంతా మోస్తరు పొగమంచు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ (ఎఓఅ) అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఎన్సీఆర్ పరిధిలో గాలి విషపూరితంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 50శాతం మంది ఉద్యోగులకు వర్క్ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తున్నది. ఢిల్లీ ప్రభుత్వంలోని 80 విభాగాలు, వివిధ ఏజెన్సీలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్లో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 1.40 లక్షలుగా ఉన్నది. అలాగే, గురుగ్రామ్లోని ఐటీ కంపెనీలు సైతం ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పిస్తున్న ది. గురుగ్రామ్, సోనిపట్, ఫరీదాబాద్తో పాటు ఎన్సీఆర్లోని పలు నగరాల్లో కాలుష్యం కారణంగా కళాశాలలు మూతపడ్డాయి. భవన నిర్మాణం, కూల్చివేతలపై కూడా ప్రభుత్వం నిషేధం విధించింది. పలు వాహనాలను రాజధాని ప్రాంతంలోకి అనుమతించడం లేదు.

# అటానమస్ కాలేజీల వెనక అక్రమ దందా

**హైదరాబాద్, నవంబర్ 22 :** ఇటీవలి కాలం వరకు ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా దక్కితే ఘనంగా చెప్పుకొనేవారు. అయితే, జేఎన్టీయూహెచ్ పరిధిలో ఇప్పుడా హోదాలేని కళాశాలలను వేళ్లపై లెక్కపెట్టొచ్చు. ప్రస్తుతం దాని పరిధిలో ఉన్న విద్యా సంస్థల్లోని 62 శాతం ఇంజినీరింగ్ కళాశాలలకు అటానమస్ హోదా ఉండటం గమనార్హం. అందులో సగం వరకు గత మూడేళ్ల కాలంలోనే సాధించాయి. వీటికి నో అ÷-జబెక్షన్ సర్టిఫికెట్ (ఎన్వోసీ)ను, తుది అనుమతి పత్రాల జారీ క్రతువులో రూ.కోట్లు చేతులు మారాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. స్వయం ప్రతిపత్తి కళాశాలలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి డిమాండ్ ఉండటంతో కళాశాలలు గత మూడేళ్లలో స్వయంప్రతిపత్తి హోదా కోసం యూజీసీకి పెద్ద ఎత్తున్న దరఖాస్తులు చేసుకున్నాయి. కళాశాలల్ని అటానమస్గా ఎదిగేలా ప్రోత్సహించే లక్ష్యంతో యూజీసీ న్యాక్ గ్రేడ్, ఎన్బీఏ గుర్తింపు తదితర పలు అంశాలకు సంబంధించి పాయింట్లను తగ్గించింది. గతంలో అటానమస్ రావాలంటే న్యాక్ 'ఏ', ఆపై గ్రేడ్ ఉండాల్సి వచ్చేంది. దాన్ని యూజీసీ బీ గ్రేడ్కు కుదించడంతో ఇంజినీరింగ్ కళాశాలలు పోటాపోటీగా దరఖాస్తు చేసుకున్నాయి. ఈ డిమాండ్ను ఆసరాగా చేసుకుని... ఆ సమయంలో జేఎన్టీయూహెచ్లో అత్యున్నత హోదాలో ఉన్న ఒకరు సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఎన్వోసీ, కన్ఫర్మెంట్ ఇచ్చేందుకు ఒక్కో కళాశాల నుంచి రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ నగర శివారులోని ఓ కళాశాల సంబంధిత మొత్తాన్ని ముట్టజెప్పని కారణంగా... దాని బోర్డ్ ఆఫ్ స్టడీస్(బీవోఎస్) తదితర కమిటీల నియామక ప్రక్రియను నెలలపాటు పెండింగ్లో పెట్టినట్లు సమాచారం. ఈ విషయం గత ప్రభుత్వంలోని ఓ నేత దృష్టికి వెళ్లినా ఆయన సైతం ఏమీ చేయలేకపోయారని, దాంతో ఆ కళాశాల సంబంధిత మొత్తాన్ని ముట్టజెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం జేఎన్టీయూహెచ్ పరిధిలో 137 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా... వాటిల్లో 85కిపైగా కళాశాలలకు యూజీసీ అటానమస్ హోదా ఉన్నవే. అందులో గత మూడేళ్లలో ఇచ్చినవే 40 వరకు ఉండటం గమనార్హం. పైకి చూస్తే అన్ని కళాశాలలకు న్యాక్ గ్రేడ్ ఉందని, నిబంధనల ప్రకారమే ఎన్వోసీ, కన్ఫర్మెంట్ ఇచ్చినట్లుగా




కనిపిస్తుంది. కానీ, విద్యార్థులు నాసిరకం కళాశాలలుగా చెప్పుకొనే వాటికి సైతం అటానమస్ హోదా దక్కడం గమనార్హం. యూజీసీ మాత్రం కళాశాల యాజమాన్యం పంపిన వివరాలు, సంబంధిత వర్సిటీ ఎన్వోసీ ఆధారంగా అటానమస్ ఇస్తూ వస్తోంది. అటానమస్ అనుమతితోపాటు సీట్ల పెంపు, కొత్త సీట్లు తదితర అంశాలకు సంబంధించి ఇష్టారాజ్యంగా ఎన్వోసీలు ఇవ్వడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వీటిపై విచారణ జరిపించాలని భావిస్తోంది. త్వరలోనే విచారణ కమిటీ వస్తుందని ఇటీవల జేఎన్టీయూహెచ్లో జరిగిన సమావేశంలో ఇన్ఛార్జి వీసీ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పినట్లు తెలిసింది. గతంలో కొన్ని కళాశాలలకు ఎన్వోసీలు మంజూరు చేయగా... ఇప్పుడు వాటిలోని ఆరేడు కళాశాలలకు తుది అనుమతి ఇవ్వడానికి ఆయన నిరాకరించినట్లు సమాచారం. నాసిరకం కాలేజీలకు స్వయంప్రతిపత్తి ఇస్తే నాణ్యత తగ్గిపోతుందని ఆయన భావిస్తున్నారు. మరోవైపు వచ్చే విద్యా సంవత్సరానికి(2025-26) కళాశాలలకు అనుమతులపై ఏఐసీటీఈ నోటిఫికేషన్ జారీ చేయడంతో అప్రమత్తమైన ప్రభుత్వం తమ ఆమోదం లేకుండా ఎన్వోసీలు జారీ చేయరాదని అన్ని వర్సిటీలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ వర్సిటీ ఇచ్చే ఎన్వోసీలు, అనుమతులు, అనుబంధ గుర్తింపు తదితర అంశాలపై సీఎం కార్యాలయం స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. పలు వివరాలను పంపాలని వర్సిటీ అధికారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నట్లు సమాచారం.



# బైడెన్ నిర్ణయం వ్యూహాత్మక తప్పిదమా?

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికార బాధ్యతలు చేపట్టనున్న వేళ రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మరింత ముదిరింది. తాజా పరిణామాలు యావత్ ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే యుద్ధం కారణంగా రెండు దేశాలు భారీగా నష్టపోయినా... ఎవరు తగ్గేదే లేదంటున్నారు. రష్యా కూడా ఉత్తర కొరియా నుంచి వేలాది మంది సైనికులను దిగుమతి చేసుకుంటోంది. వారిని ఉక్రెయిన్ సరిహద్దుల్లో మోహరిస్తోంది. ఉక్రెయిన్పై భీకర దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రష్యా తీరుతో ఉక్రెయిన్ కూడా ఎక్కడా వెనక్కి తగ్గటం లేదు. ఉక్రెయిన్, దాని మిత్రపక్షాలు కొత్త వ్యూహాలను రెడీ చేస్తున్నాయి. ఉక్రెయిన్కు అందజేసిన లాంగ్ రేంజ్ మిస్సైళ్ల వాడకంపై ఇప్పటిదాకా ఉన్న పరిమితులను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సడలించారు. రష్యా భూభాగంలోకి మరింత ముందుకు చొచ్చుకెళ్లి దాడులు చేసేందుకు తాజాగా అనుమతి ఇవ్వడంతో ఈ యుద్ధం పతాక స్థాయికి చేరుకుంది. తాను పదవి నుంచి దిగిపోయే లోపు ట్రంప్ ను ఇరుకున పెట్టడమే బైడెన్ వ్యూహంగా కనిపిస్తోంది. జో బైడెన్ అనుమతితో ఇప్పటికే ఉక్రెయిన్ దళాలు రష్యా భూభాగంలోకి క్షిపణులను ప్రయోగిస్తున్నాయి. అమెరికా, యూకే మిస్సైల్ సిస్టమ్ను రష్యాపై ప్రయోగిస్తోంది. దీనివల్ల రష్యాకు భారీగా నష్టం జరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే ట్రంప్ ప్రత్యర్థి అయిన జో బైడెన్ యుద్ధాన్ని మరింత ఉధృతం చేసే దిశగా నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. శత్రుదేశంపై కేవలం మాటలతో దాడులు చేయలేవని తెలిపారు. కొన్ని విషయాలు నోటితో చెప్పలేమని, క్షిపణులే మాట్లాడుతాయని పేర్కొన్నారు. అమెరికా సహా పశ్చిమదేశాలు ఇచ్చిన కీలక ఆయుధాలను రష్యాపై ప్రయోగించడానికి అనుమతి ఇవ్వాలంటూ జో బైడెన్పై కొన్ని నెలలుగా ఒత్తిడి వచ్చింది. ఆ ఒత్తిడికి తలొగ్గి ఆయన అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే సమయంలో డొనాల్డ్ ట్రంప్ను ఇరుకున పెట్టాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా సరఫరా చేసిన క్షిపణులను రష్యాపై ప్రయోగించడానికి అధ్యక్షుడు జో బైడెన్ గ్రీన్సిగ్నల్ ఇవ్వడంపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేశాయి. రెచ్చగొట్టే చర్యలు మానుకోవాలని హెచ్చరించింది.

## విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



**వారధి న్యూస్, గోదావరిఖని :** రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఉత్తర్వుల ప్రకారం, ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల గోదావరిఖని లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఈ ఆధునిక టెక్నాలజీ కాలంలో సెల్ ఫోన్ వినియోగం పెరిగిపోయిందని అన్నారు. ప్రతినిమిషం సెల్ ఫోన్ లేనిది ఏ పని చేయలేకపోతున్నామని, ప్రతిదీ కూడా సెల్ ఫోన్ తోనే లింక్ ఉ ఒడడంతో మన సెల్ ఫోన్ నెంబర్ కూడా మన బ్యాంక్ అకౌంట్, పాన్ కార్ట్, ఆధార్ కార్డు, పెన్షన్, పౌరసరఫరాల వినియోగానికి సంబంధించి అన్ని విధాలుగా మన సెల్ ఫోన్ నెంబర్ అవసరం ఉ ఒటుందని అన్నారు. దాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మనకు ఏదో లేనిపోని ఆశలు చూపించి అదేవిదంగా కొత్తగా పెళ్లి కార్డ్స్ ఏపీకె ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ అని సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. సైబర్ నేరాల పట్ల, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మత్తు పదార్థాలు డ్రగ్స్ వంటి తదితర అంశాల పై యువత, విద్యార్థునులకు పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల కాలంలో మహిళలు పిల్లలను టార్గెట్ చేసుకొని సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం, పిన్ నెంబర్ , సీవీవీ, బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎవరైనా మీకు లాటరీ తగిలింది, కొంత డబ్బును సూచించిన బ్యాంకు ఖాతాలో జమచేయాలని ఫోన్ కాల్ వచ్చినా, ఏ విధంగా అయినా మీరు మీ బ్యాంకు ఖాతా నుండి డబ్బును కోల్పోతే వెంటనే సమీప పోలీస్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎలాంటి ఆపద సమయంలో సైబర్ నేరాల పట్ల https://www.>cybercrime. goశి.గాని టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 లకు ఫోన్ చేసి పోలీసుల సేవలు పొందాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రజా సంఘాలు, హిందూ సంఘాలు డిమాండ్.



వారధి న్యూస్, షాద్ నగర్: జానంపేట బసవన్న దేవాలయంలో శివలింగం ధ్వంసం ఘటన పట్ల స్థానిక ప్రజలతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శివలింగం ధ్వంసానికి సంబంధించిన పరిస్థితులను తెలుసుకునేందుకు పోలీసులు, రాజకీయ నాయకులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. సిఐ విజయ్ కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, పాత శివలింగాన్ని తొలగించి కొత్త శివలింగాన్ని ప్రతిష్టించిన తరువాత పాత శివలింగం బయటపడిందని, దాన్ని ఎవరో ధ్వంసం చేశారని తెలిపారు. ఈ ఘటన మద్యం మత్తులో జరిగినదా, లేక కావాలని దాడి చేశారా అన్న కోణంలో విచారణ కొనసాగుతుందని చెప్పారు.

**రాజకీయ నాయకుల స్పందన :**

బీజేపీ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి దేవాలయ ధ్వంసంపై తీవ్ర విమర్శలు చేస్తూ, హిందూ మనోభావాలను దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అగ్గనూరు బస్వం కూడా సంఘటన స్థలాన్ని పరిశీలించి, హిందువుల మనోభావాలను కాపాడే దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటన ద్వారా స్థానికంగా ఉద్రిక్తతలు ఏర్పడినప్పటికీ, పోలీసులు విచారణను వేగవంతం చేసి నిజాన్ని బయటపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



## పోయిన ఫోన్లను అప్పగించిన పోలీసులు

**వారధి న్యూస్ బిఆత్మకూర్.,** ఆత్మకూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ నందు శుక్రవారం వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న ఫోన్ల ను బాధితులకు ఆత్మకూర్ సిఐ శివకుమార్ ఎస్ఐ నరేందర్ మూడు ఫోన్లను అప్పగించడం జరిగింది. వీరు జి లక్ష్మి జూరాల, కే తిమ్మప్ప నేరుడ్గం, డి శంకర్ ఆత్మకూర్, మొదలుగా వారు ఫోన్లను పోగొట్టుకొని ఆత్మకూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా పరిశీలించి ఆటి ఫోన్లను స్వాధీనం చేసుకుని

బాధితులకు అప్పజెప్పడం జరిగింది.



## ప్రభుత్వంపైన విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** ప్రభుత్వం పైన విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లల వార్డు లో చికిత్స పొందుతున్న మాగనూరు హాస్టల్ విద్యార్థులను ఆయన పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని, మరియు వారికి అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ ను వంట సామాగ్రి ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులు క్రితం మాగనూరు కు చెందిన హాస్టల్ విద్యార్థులు అక్కడ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ వల్ల ఆసుపత్రి లో చేరడం జరిగిందని, విద్యార్థులకు అందించిన అల్పాహారం లో ఏవో పురుగులు వచ్చాయని కొందరు కావాలని ఆసుపత్రి కి వచ్చి ఆందోళన చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు ఆసుపత్రి కి వచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు పూర్తిగా కిచెన్ ను , భోజనానికి వినియోగించే వస్తువులను బియ్యం, పప్పులు అన్నింటినీ పరిశీలించడం జరిగిందని, ఆసుపత్రి లో రోగులందరికీ ఇక్కడ నుంచే ఆహారం అందిస్తుంటే కేవలం ఒకే ఒక్క విద్యార్థికి మాత్రమే పురుగులు రావడం జరిగింది అని, దానిపైన పూర్తిగా విచారణ చేస్తామని, ఒకవేళ అధికారుల తప్పిదం ఉంటే చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. వైద్యులు చాలా మంచి వైద్యం అందిస్తున్నారని, కావాలనే కొందరు ప్రభుత్వం పైన, ప్రభుత్వ యంత్రాంగం పైన విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఆందోళనకరంగా ఆసుపత్రి కి వచ్చిన విద్యార్థులను అక్కున చేర్చుకుని ఆసుపత్రి లో చేర్పించుకొని, వారికి మంచి వైద్యాన్ని అందించారని, వైద్యుల కృషి వల్లనే ఆపదలో ఉన్న విద్యార్థులు ఆరోగ్యంగా బయటపడ్డారని, ఇంకా ఇద్దరు తప్ప మిగతా అందరూ కూడా పూర్తి ఆరోగ్యవంతులుగా రిపోర్ట్స్ రావడంతో వారిని పంపించారని, మిగిలిన ఇద్దరికి కూడా మంచి వైద్యం డాక్టర్లు అందిస్తున్నారని వారికి కూడా ఎలాంటి అపాయం లేదని రిపోర్టు వచ్చాక వారిని కూడా డిస్చార్జ్ చేస్తామని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే తో పాటు ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సాదుల్లా ,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కౌన్సిలర్ ఖాజా పాష, నాయకులు ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రాత పరీక్ష లేకుండా రెండవ ఏఎన్ఎం లను రెగ్యులరైజ్ చేయాలి

- రాష్ట్ర అసోసియేషన్ ఫౌండర్ ,అధ్యక్షురాలు పడాల మమత...

**వారధి న్యూస్ ,జగిత్యాల ప్రతినిధి :** తెలంగాణాలో జాతీయ హెల్త్ మిషన్ విభాగంలో రెండవ ఏఎన్ఎం లు గా గత 18 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వారిని ఎలాంటి వ్రాత పరీక్షా లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ 2వ ఏఎన్ఎం ల అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షురాలు పడాల మమత జాతీయ హెల్త్ మిషన్ కేంద్ర సహాయ కార్యదర్శి డాక్టర్.సరోజ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 రకాల విధులను పల్లెల్లో, పట్టణాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతూ ప్రజలకు వైద్య సేవలందిస్తున్నమని మాకు ఎలాంటి ఆంక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలని అన్నారు. ఈ మేరకు మమత ఢిల్లీలోని జాతీయ హెల్త్ మిషన్ కేంద్ర కార్యాలయానికి వెళ్లి సరోజ్ కుమార్ కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ మొదటి ఏ.ఎన్.ఎం లతో సమానంగా 10 ఏళ్లకు పైగా రెండవ ఏ ఎన్.ఎం లు గా జాతీయ వైద్య మిషన్ లో వివిధ రకాల సేవలందిస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండవ ఏఎన్ఎం ,యూ.పి.హెచ్ .సి,లో కాంట్రాక్ట్,ఔట్ సోర్సింగ్ లో తెలంగాణాలో దాదాపు 6 వేల మంది కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారని, అందులో గత ఏడాది జులై నెలలో విడుదల చేసిన నోటిఫికేషన్ లో 1930 పోస్టులు మాత్రమే వేసి,మిగత వాటిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 వరకు ఉద్యోగంలో ఉన్న వారిని రోస్టర్ ప్రకారం సీనియారిటీని పరిగణలోకి తీసుకుని రెగ్యులరైజ్ చేయాలని మమత కేంద్ర వైద్య మిషన్ సహాయ కార్యదర్శిని కోరారు. 10 ఏళ్లకు పైగా విధులు నిర్వహిస్తూ 50 ఏళ్ళు దాటిన వారు చాలామంది రిటైర్మెంట్ కు దగ్గరగా ఉన్నారని,ఇప్పటి జనరేషన్ ప్రకారం సెకండ్ ఏఎన్ఎంలు పరీక్షల్లో పోటీ పడలేరని,డాక్టర్ల మాదిరిగానే ఎలాంటి వ్రాత పరిక్షా లేకుండా రెగ్యులరైజ్ చేయాలని మమత విజ్ఞప్తి చేశారు. జాతీయ వైద్య మిషన్ లో పనిచేస్తున్న వారిని దేశంలోని మాణిపూర్, ఒడిస్సా, తమిళనాడు ప్రభుత్వాలు ఎలాంటి పరీక్షా లేకుండా రెగ్యులర్ చేశారని,అలాగే తెలంగాణాలో పని చేస్తున్న వారిని సైతం రెగ్యులర్ చేసి ఆదుకోవాలని మమత కోరారు.



## ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్‌పై ఏ హెూదాతో విమర్శలు చేసావు

- డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, అచ్చ వేణు

**వారధి న్యూస్, గోదావరిఖని :**అధికార పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగుబాటు తప్పదని, ప్రజల బుద్ధి చెప్పే రోజులు వచ్చాయని డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, అచ్చ వేణులు అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్ పై ఏ హెూదాతో విమర్శలు చేసావని వారు ప్రశ్నించారు. రామగుండం నియోజకవర్గంలో ప్రజలను మభ్యపెడుతూ కూల్చడమే తప్ప అభివృద్ధి ఏమి జరగడం లేదని అన్నారు. అసలు ఎందుకు కూల్చివేతలు చేస్తున్నారో అధికారులకే తెలియదని, కనీసం దీనిపై మీకు అయిన పూర్తి అవగాహనా ఉందా అని ప్రశ్నించారు. అంతే కాకుండా




కేవలం రామగుండంలో కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మీడియా సమావేశంలో అసలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏం మాట్లాడుతున్నారో అర్థం కానీ పరిస్థితి నెలకొంటుదన్నారు. ఎటువంటి ప్రణాళికలు లేకుండానే కూల్చివేతలు చేయడం ఏంటని ప్రశ్నించారు. మాజీ మంత్రి రాజకీయాల్లోకి వచ్చినప్పుడు అసలు నువ్వు ఏ స్థాయిలో ఉన్నవో ఆలోచించుకోవాలని అన్నారు. మరో సరి ఇలాంటి ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు బాదే అంజలి, గాదం విజయ, కృష్ణవేణి, నారాయణదాసు మారుతీ. గోపు ఐలయ్య యాదవ్, నూతి తిరుపతి, మెతుకు దేవరాజ్, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, యాసర్ల తిమోతి, అవునూరి వెంకటేష్, ఇరుగురాళ్ల శ్రావణ్, సమ్మెట స్వప్న, సంధ్యారెడ్డి, గడ్డం నారాయణ, ఐలయ్య, ఈదునూరి శంకర్, ఈదునూరి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



## బీసీల హక్కుల కోసం బహిరంగ విచారణలో డిమాండ్లు

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన కోసం బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ బీసీ కమిషన్‌కు పలు డిమాండ్లు ఉ ంచారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ విచారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బీసీల సంక్షేమానికి సంబంధించి కీలకమైన పలు అంశాలను ప్రస్తావించారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. రాజకీయ రిజర్వేషన్లు: స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా శాతానికి అనుగుణంగా 50% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.
2. సబ్ ప్లాన్ అమలు: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టి ప్రతి ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో 50% నిధులు కేటాయించాలన్నారు.
3. సింగిల్ విండో ఎన్నికలు: సహకార బ్యాంకుల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.
4. ఫీజు రీయింబర్స్మెంట్: బీసీ విద్యార్థులకు ఉన్నత విద్య కోసం పూర్తి ఫీజు రీయింబర్స్మెంట్ అందించాలని కోరారు.
5. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు: ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పున:పరిశీలించి, బీసీలకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.
6. ప్రత్యేక యాక్ట్: బీసీలకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తరహాలో ప్రత్యేక యాక్ట్ తీసుకురావాలని, లేదా ఆ యాక్ట్‌లో బీసీలకు రక్షణ కల్పించాలని సూచించారు.
7. నామినేటెడ్ పదవుల్లో బీసీ కోటా: యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లు, ప్రభుత్వ సలహాదారులు, జిల్లా కలెక్టర్లు, పోలీస్ సూపరిండెంటు స్థాయిలో బీసీలకు 50% కేటాయింపులు ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి కార్యదర్శి వి. వెంకటన్న గౌడ్, మహేందర్ నాయుడు, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## 50 శాతం తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలి

- బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్



**వారధి న్యూస్ మహబూబ్ నగర్ :** ఎన్నో ఏళ్లుగా ఎదుచూస్తున్న సమగ్ర కుల గణన చేయటానికి ప్రభుత్వం ముందుకు రావడాన్ని బీసీ సమాజం మొత్తం అభినందిస్తు అదేవిధంగా 50% శాతం తగ్గకుండా రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ సాగర్ అన్నారు.. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ బీసీ కమీషన్ అదర్వంలో నిర్వహించిన బహిరంగ చర్చలో మాట్లాడుతూ చాలా బీసీ కులాలు, యంబిసి కులాలు, ఉత్పత్తి కులాలు ఈరోజు వరకు విద్యపరంగా , రాజకీయపరంగా చాలా వెనుకబడి ఉన్నారని, రాజకీయ ప్రాధాన్యత లేని కులాలు చాలా ఉన్నాయని ప్రస్తుతం జరుగుతున్న కుల గణన ఆధారంగా వారికి చట్టసభలో కాలు మోపేందుకు అవకాశాలు కల్పించాలని కమిషన్ ద్వారా ప్రభుత్వాన్ని శ్రీనివాస్ సాగర్ కోరారు. కుల వృత్తిపై ఆధారపడి చాలా కులాలు ఉన్నాయని, ప్రభుత్వం బీసీకార్పొరేషన్ లకు ప్రత్యేక బడ్జెట్లను కేటాయించి ఆర్థికంగా ముందుకు పోయే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.. ఈడబ్ల్యూఎస్ పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానంలో ఈరోజు చాలామంది బీసీలు నిరుద్యోగులుగా మారడం జరిగిందన్నారు. బీసీల రిజర్వేషన్లను అగ్రవర్ణాల వాళ్ళు తీసుకెళ్తున్నారని అగ్రవర్ణాల వాళ్ళ లెక్క తేల్చి వాళ్లకు రిజర్వేషన్లు కల్పించి మిగిలిన శాతాన్ని బీసీలలో కలిపి విద్యా రాజకీయపరంగా, ఉద్యోగ పరంగా ముందుకు పోయే విధంగా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని శ్రీనివాస్ సాగర్ కోరారు.



## సిపిఎం పార్టీ ఉమ్మడి నర్సింహులు పేట మండల కమిటీ సమావేశం

**వారధిన్యూస్, మహబూబాబాద్ ప్రతినిధి:** సిపిఎం పార్టీ ఉమ్మడి నర్సింహులు పేట మండల సమావేశాన్ని జక్కుల లింగయ్య అధ్యక్షతన నిర్వహించారు,ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గునిగంటీ మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని రైతులకు రైతు భరోసా ఇస్తామని మోసం చేస్తుందన్నారు, ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారి స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తూ గ్రామపంచాయతీలకు మండల, జిల్లా, పరిషత్ లకు రావాల్సిన నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు, లగచర్ల ఘటనపై మాట్లాడుతూ నిర్బంధ రాక్షస పాలనను విడనాడాలనీ తెలిపారు,ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాస్, కొమ్మినేని రామేశ్వరం, కందుకూరిసుధాకర్, మల్లయ్య, యాకూబ్ సర్వం, కారపాటి వెంకన్న, మధు, తదితరులు పాల్గొన్నారు.

## 149 అక్రమ ఇసుక తరలింపు వాహనాల పట్టివేత

- అక్రమ ఇసుక రవాణాపై ప్రకటన విడుదల చేసిన కలెక్టర్ శ్రీహర్ష



**వారధి న్యూస్, గోదావరిఖని :** పెద్దపెల్లి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 21 నాటికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 149 వాహనాలను నిర్బంధించి, 25 లక్షల 99 వేల 790 రూపాయల జరిమాన వసూలు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెద్దపల్లి జిల్లాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 86 ట్రాక్టర్లు, 63 టిప్పర్లు, ను పట్టుకొని కేసులు బుక్ చేశామని, వీరి వద్ద నుంచి ఇప్పటి వరకు 25 లక్షల 99 వేల 790 రూపాయల జరిమాన వసూలు చేశామని అన్నారు. ఇక నుంచి జిల్లాలో అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ నుంచి 25 వేల రూపాయలు, టిప్పర్ నుంచి లక్ష రూపాయల జరిమానా వసూలు చేయడం జరుగుతుందని, ఇదే కాకుండా అక్రమ ఇసుక రవాణా దారుల పై సెక్షన్ 379,21 ఎంఎండిఆర్ యాక్ట్ 1957 , పీడి యాక్ట్ ల క్రింద కేసు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు ఇసుకను ఆన్ లైన్ ద్వారా సాండ్ ట్యాక్సీ నందు బుక్ చేసుకోవాలని, బుక్ చేసుకున్న 24 గంటలలో ఇసుక డెలివరీ చేయడం జరుగుతుందని, సాండ్ ట్యాక్సీ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



## పేద యువతి వివాహానికి చేయూత

- ఓదార్చే మాటల కన్నా సహాయం చేసే చేతులే మిన్న'

**వారధి న్యూస్ , జగిత్యాల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మెడిపెల్లి మండలం పొరుమల్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన ఓడ్నాల లత,రాములు దంపతుల ద్వితీయ పుత్రిక రచన వివాహానికి శుక్రవారం జగిత్యాల శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి వారు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గీతా సిల్క్ హౌజ్ అధినేత (స్వర్గీయ కస్తూరి జగదీశ్వర్ ) జ్ఞాపకార్థము వారి కుమారుడు కస్తూరి శశిధర్ యువతి కి పెండ్లి పట్టుచీర ను అందించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యములో చేస్తున్న పలు సేవా కార్యక్రమములో భాగముగా ముఖ్యంగా ఆడ పిల్లల పెండ్లి కోసం నిరుపేద తల్లిదండ్రులకు అండగా నిలిచి కొంత ఆర్థిక సహాయమును అందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థను నెలకొల్పినట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో ఆకుబత్తిని శ్రీనివాస్,(మాజీ అధ్యక్షులు) పద్మశాలి సేవా సంఘం. శ్రీ భక్త మార్కండేయ యువజన స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షులు చిలుకమారి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అనుమల్ల శ్రీనివాస్, కోమాకుల సుదర్శన్,జోగ మల్లేశం,ఆడెపు సత్యం తదితరులు పాల్గొన్నారు.




## విధులు బహిష్కరించిన నిరసన తెలిపిన న్యాయవాదులు

**వారధి న్యూస్, కొల్లాపూర్ :** తమిళనాడు రాష్ట్రంలో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నా వ్యక్తిపై హత్యాయత్నం చేసినందుకు నిరసనగా కొల్లాపూర్ కోర్టు లో ఉన్న న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో కోర్టు ముందు నిరసన తెలిపి దోషులను కఠినంగా శిక్షించాలని అడ్వకేట్ ప్రొటెక్షన్ ఆక్ట్ ను వెంటనే అమలు చేయాలని న్యాయ వాదులు కోరారు. లేనిపక్షంలో అన్ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నిరసనలు చేస్తామని తెలిపారు. న్యాయవాదులు భూజల భాస్కర్ రెడ్డి, ఉపేందర్,మధుసూదన్, శివారెడ్డి, నజీరొద్దిన్, కురుమయ, కురుమూర్తి , బాలస్వామి, నిరంజన్, రాఘవేంద్ర, మనోహర్, నాగరాజు,రాజేష్, పసుపుల రాజు, మల్లయ్య, రామలక్ష్మమ్మ, రేణుక, పాల్గొన్నారు.

## 500 బోనస్‌తో రైతుల్లో ఆనందం

- ఎండి అంజాద్ అలీ, టీపీసీసీ మైనార్టీ కార్యదర్శి



**వారిధి న్యూస్, ఆత్మకూర్ :** తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో, ధాన్యం సేకరణ పూర్తయ్యే సమయానికే రైతుల ఖాతాల్లో రూ. 500 బోనస్ జమచేయడం ద్వారా రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఈ చర్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డిలకు ఆత్మకూర్ నియోజకవర్గం నుంచి కృతజ్ఞతలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొడుతూ, ఇచ్చిన మాట ప్రకారమే బోనస్ అందించినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మధునాపురం కాంగ్రెస్ నాయకులు రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

# ఆర్‌ఎంపీలు తప్పుడు వైద్యం చేస్తే కఠిన చర్యలు

- రోగ నిర్ధారణ, మందులు,ఇంజెక్షన్లు ఇవ్వడం చేయరాదు
- ఇన్-పేషెంట్ వైద్యం చేయకూడదు, ల్యాబ్ లను నిర్వహించరాదు
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె .ప్రమోద్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి, వారధి న్యూస్ :** పట్టణాల్లో,గ్రామాల్లో ఆర్ఎంపీలు తప్పుడు వైద్యం చేస్తే జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె .ప్రమోద్ కుమార్ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జగిత్యాల జిల్లా స్థాయి ఆర్ఎంపి, పిఎంపీలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని తప్పుడు వైద్యం,అబార్షన్లు, ప్రసవాలు, కొన్ని రకాల సర్జరీలు చేస్తూ కొందరు ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అంతేగాకుండా విచ్చలవిడిగా యాంటీబయాటిక్స్ మందులను రోగులకు ఇస్తున్నారని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించారు. ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నట్లు అనేక ఆరోపణలు వస్తున్నాయని, ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం న డ ు చ ు కో వా ల ని సూచించారు. ఆర్ఎంపీలు తమ చికిత్స కేంద్రం ముందు సూచిక బోర్డులపై ఫస్ట్ అయిడ్ సెంటర్ లేదా ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ప్రదర్శించాలని, క్లినిక్, ఆసుపత్రి, నర్సింగ్ హోం,మెడికల్ సెంటర్ లేదా మరే ఇతర పేర్లతో సూచిక బోర్డులను ప్రదర్శించరాదని పేర్కొన్నారు. ప్రథమ చికిత్స చేసే వ్యక్తులు ప్రభుత్వ సూచనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎన్సిడి టీవీ కేసెస్ గుర్తించడంలో కూడా మీ వంతు సహకారం ఉండాలని తెలిపారు. డాక్టర్ మాదిరిగానే చాలామంది నకిలీ డాక్టర్లు మానసిక ఔషధాల ప్రిస్క్రిప్షన్ లో ఇష్టారాజ్యంగా మందులు రాస్తున్నారని తేలిందని అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.





**ఆర్ఎంపీలకు సూచనలు...**

- ఆర్ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసి మందులు ఇవ్వడం లేదా ఇంజెక్షన్లు చేయడం వంటివి చేయరాదు.
- రోగులకు వైద్య మందుల చీటీని (ప్రిస్క్రిప్షన్) రాయకూడదు.
- రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కించరాదు.
- ఇన్-పేషెంట్ వైద్యం చేయకూడదు, ల్యాబ్లను నిర్వహించరాదు.
- అబార్షన్లు, కాన్పుల వంటి హైరిస్క్ చికిత్సలు చేయరాదు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ పి.అర్చన,డాక్టర్ జైపాల్ రెడ్డి , ఆఫీస్ సిబ్బంది ఏ.రాజేశం, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ,భూమేశ్వర్ హెల్త్ ఎడ్యుకేటర్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం జిల్లా ఆర్ఎంపీ, పి.ఎం.పి ల అసోసియేషన్ వారు నూతనంగా నియమింపబడిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె .ప్రమోద్ కుమార్ కు సన్మానం చేశారు.

## చర్చ్ లకు వర్క్ ఆర్డర్లను పాస్టర్లకు అందించిన ప్రభుత్వ విప్



**వారధి న్యూస్, జగిత్యాల ప్రతినిధి :** చర్చ్ వర్క్ లకు ఆర్డర్లను పాస్టర్లకు అందించడం జరుగుతుందని ప్రభుత్వ విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ధర్మపురి పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ నియోజకవర్గంలోని 34 చర్చిలకు రూ. 2 లక్షల చొప్పున మైనార్టీ వెల్ఫేర్ ద్వారా మంజూరు అయిన రూ. 68 లక్షల రూపాయల విలువ గల వర్క్ ఆర్డర్లను చర్చి పాస్టర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చర్చిలకు సంబంధించి జీవో జారీ చేసి పనులు చేయకుండా పెండింగ్ లో ఉండటంతో తిరిగి ప్రభుత్వానికి వెళ్లిన డబ్బులను జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెనక్కి తీసుకొచ్చి అట్టి నిధులు సుమారు రూ. 68 లక్షల రూపాయలకు సంబంధించిన వర్క్ ఆర్డర్లను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జి.ఓ నెం.75 ద్వారా 2022 లో 47 చర్చిలకు గాను మొత్తం రూ. 96.50 లను గత ప్రభుత్వంలో మంజూరు చేస్తే అందులో కొన్ని చర్చలకు సంబంధించి పనులు పూర్తి చేసి ఉన్నాయని,మిగిలిన వాటికి వర్క్ ఆర్డర్లు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇంకా ఎవరికైనా డబ్బులు రాని వారు ఉన్న,ఇచ్చిన జాబితాలో ఎవరి చర్చి పేరు లేకపోయినా ప్రభుత్వంతో మాట్లాడి అట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసే విధంగా దేవిడి ఆశీస్సులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన ఉండాలని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పథకం సాధించిన జగిత్యాలకు చెందిన విద్యార్థి మోక్షిత్

**జగిత్యాల ప్రతినిధి , వారధి న్యూస్ :** జగిత్యాల జిల్లా మెట్ పెల్లి లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్ కు చెందిన ఏడవ తరగతి విద్యార్థి డి.మోక్షిత్ 100 మీటర్ల పరుగు పందెంలో 16.01 సెకండ్లలో పూర్తి చేసి మూడవ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి మెడల్ అందుకున్నట్లు పాఠశాల పీ.డి రాధిక తెలిపారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిపిన ఈ పోటీల్లో 12 సంవత్సరాల బాలుర విభాగంలో మోక్షిత్ పాల్గొని ఈవెంట్ సాధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో క్రీడల్లో పాల్గొని ప్రశంస పత్రాలు పొందినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.రామానుజన్,
ఉపాధ్యాయ సంఘ నాయకుడు బోనగిరి దేవయ్య ,జయశ్రీ,రజాక్ ,రజిత, శ్రీలత, శ్రీనివాసరెడ్డి ,కమలాకర్ రెడ్డి, కరుణాకర్ ,కుమార్, జుబేర్ ,సత్యనారాయణ, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

# పేదింటి ఆడ పిల్లలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ వరం లాంటిది

- శంకరంపేట ఆర్ మండలంలో 01 కోటి 68 లక్షలు రూపాయలు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పంపిణీ
- శంకరంపేట మండలం ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్, కళ్యాణ్ లక్ష్మీ చెక్కులు పంపిణీ
- మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు



**వారధి న్యూస్ మెదక్ బ్యూరో :** కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం యాదింటి ఆడబిడ్డలకు వరం లాంటిదని స్థానిక శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు శుక్రవారం శంకరంపేట ఆర్ మండలంలో కళ్యాణ లక్ష్మి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేసిన అనంతరం శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ ద్వారా శంకరంపేట ఆర్ మండలంలో కోటి 60 లక్షల రూపాయలతో కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకానికి సంబంధించి చెక్కులు పంపిణీ చేశామని, అలాగే సీఎంఆర్ఎఫ్ 6 లక్షల రూపాయలు పంపిణీ చేసినట్లు వివరించారు. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చేసే ప్రభుత్వం అని చెప్పారు . జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరుగుతుందని 470 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు చేసి రైతులకు ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. సన్న వడ్లకు 500 రూపాయలు బోనస్ కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. మెదక్ జిల్లాలో ఈరోజు జరిగిన ప్రమాదం దురదృష్టకరమని ప్రమాదంలో మరణించిన వారికి సానుభూతి తెలియజేస్తూ మరణించిన వారికి పోస్టుమార్టం తొందరగా నిర్వహించి బాడీ త్వరగా అప్ప చెప్పే విధంగా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్సలు అందించి త్వరగా కోలుకునే విధంగా ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మన్నన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, శంకరంపేట రాజిరెడ్డి గంగా నరేందర్ రమేష్ గౌడ్ జీవన్ బిక్షపతి రాజశేఖర్ శ్రీనివాస్ పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## చేప పిల్లలను వదిలిన మత్స్య కారులు

**వారధి న్యూస్, కొల్లాపూర్ :** కొల్లాపూర్ మండల పరిధిలోని రిజర్వాయర్ లు , చెరువుల్లో శుక్రవారం 6లక్షల 91వెయ్యి 190 చేప పిల్లల ను వదిలినట్లు మత్య శాఖ ఏ డి రజిని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి, నార్లాపూర్ రిజర్వాయర్ లో టీఎంసీ పైన నీళ్లు ఉండడంతో కొల్లాపూర్ ,కుడికిల్ల, మొల చింతలపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సహకారంతో శుక్రవారం చేప పిల్లలను వదిలామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కొల్లాపూర్ అధ్యక్షులు సుధాకర్, సీనియర్ జిల్లా మాజీ డైరెక్టర్ నక్క బిచ్చన్న , మత్స్యకారులు మాట్లాడుతూ.... కొల్లాపూర్, మొల చింతలపల్లి, కుడికిల్ల , ముక్కిడిగుండం, చుక్కాయిపల్లి, వరిదేల సంప్రదాయంగా వస్తున్న మా వృత్తి ద్వారా జీవనోపాధి పొందేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హక్కులు కల్పించిందని పెద్ద రిజర్వాయర్ కావడంతో ఇంకా నీటిని ఎత్తిపోసి ప్రభుత్వం ద్వారా ఉచిత చేప పిల్లలు లక్షల్లో వదిలిపెట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. మత్స్యకారుల చేపలు పెరిగి పెద్దయ్యాక చేపల షికారి చేస్తూ జీవనోపాధి పొందుతామని వారు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఉచిత చేప పిల్లలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పిట్టల సుధాకర్ కుడికిల అధ్యక్షుడు చెన్నయ్య బి రాజు వెంకటయ్య నాగరాజు బాలకృష్ణ అంజి సూరి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగుల అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** గిరిజన ఉద్యోగుల సంఘం వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా. అర్జున్ ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్లను ఏకీగ్రీవంగా ఎంపిక చేశారు. శుక్రవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని ఎంవైఎస్ ఫంక్షన్ హాల్ లో గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కమిటీ నూతన అధ్యక్షులుగా అర్జున్ ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్, కోశాధికారిగా గోపాల్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ నాయక్ పాల్గొని రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ మన గిరిజన ఉద్యోగులుగా మనం మన కుటుంబానికే కాకుండా మన రిజర్వేషన్లో ఉద్యోగం సంపా దించినం కాబట్టి గిరిజన జాతికి రిప్రెసెం టేటివ్స్ అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పడం జరిగిందని ఈ విషయాన్ని రాజ్యాంగంలో చేర్చారని అన్నారు. కావున మనం గిరిజన జాతి కొరకు పాటుపడాలని రాజ్యాంగంలోనే రాసి ఉందని వక్కాణించారు. అదేవిధంగా అధ్యక్షుడు అర్జున్ నాయక్ మాట్లాడుతూ. గిరిజనుల సమస్యలపై అనునిత్యం అధ్యయనం చేసి సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాక ఇప్పటికీ గిరిజనులు పేదరికంలోనే ఉన్నారని అన్నారు. మా ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీ బిచ్చా నాయక్ రాష్ట్ర కార్యదర్శి శ్రీ బాలునాయక్ మరియు వనపర్తి జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.




## నిరంతర ఆన్లైన్ సేవలు అందించాలి

- పెండింగ్ క్లెయిమ్స్ విడుదల చేయాలి
- తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్

**వారధి న్యూస్, వనపర్తి:** తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ శుక్రవారం వనపర్తిలో జరిగిన కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో కీలకమైన డిమాండ్లను ప్రస్తావించారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతర ఆన్లైన్ సేవలు అందించాలని, అలాగే 2009 సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాల ప్రతినిధులతో సంక్షేమ బోర్డు అడ్వైజరీ కమిటీను ఏర్పాటు చేయాలని మరియు కార్మిక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బోర్డు నిధులను అక్రమంగా దారి మళ్లించడం వల్ల కోట్లు వృథా అవుతున్నాయనీ, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మరిన్ని డిమాండ్లలో, 2024 సంవత్సరంలో 1100 పెండింగ్ క్లెయిమ్స్ కు నష్టపరిహారాలు అందించుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు ₹5000 పెన్షన్ అమలు చేయాలని, అలాగే మౌలిక సదుపాయాలు కేటాయించాలని తెలిపారు. స్టీల్, సిమెంట్ ధరలను తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని కూడా ఆయన సూచించారు. ఈ సమావేశంలో గంధం మదన్ అధ్యక్షతన డీ. కురుమన్న, కె. వెంకటయ్య, చెన్నారం శ్రీను, భాస్కర్, బాబు, రవి రాజు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న చలి తీవ్రత

### రోజురోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు

- అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు కురుస్తున్న మంచు
- రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం
- పిల్లలు. వృద్దులు జాగ్రత్తగా ఉండాల్సిందే
- పొగ మంచు.. ఆలస్యంగా మార్నింగ్ వాక్
- వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



**చలి తీవ్రత పెరిగింది. దానికి తోడు మంచు కురుస్తుండడంతో ఉదయం పూట బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతుంది. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఉండాల్సిన ఉష్ణోగ్రతల కన్నా రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతల తక్కువగా ఉంటున్నాయి ఉష్ణోగ్రతలు గత వారం రోజుల నుంచి వేగంగా పడిపోతున్నాయి. ప్రధానంగా వృద్ధులు. పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తేల్చి చెబుతున్నారు మంచు నేపథ్యంలో వాహనాదారులు జాగ్రత్తలు తీసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. తెల్లవారుజామున ప్రయాణాలు చేసేవాళ్లు తమ వాహనాలకు లైట్లు వేసుకొని వెళ్లాల్సి నా పరిస్థితులు..వేగంగా వెళ్తే మాత్రం తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది.**

వారధి న్యూస్ మెదక్ బ్యూరో : గతసారితో పోలిస్తే ఈసారి చలి తీవ్రత పెరిగింది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నాయి. చలి తీవ్రత నేపథ్యంలో ఇల్లు నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితిలో నెలకొన్నాయి. కాస్త ఎండ వచ్చిన తర్వాతే ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. చలి తీవ్రత కారణంగా వృద్ధులు పిల్లలకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తేల్చి చెబుతున్నారు. కార్తీక మాసం నేపథ్యంలో శివాలయాల్లో సందడి నెలకొంది. చలి తీవ్రత నేపథ్యంలో భక్తులు తెల్లవారుజాము నుంచే దేవాలయాల్లో పూజలు చేసేందుకు వెళు_న్నారు. చలిని లెక్కచేయకుండా దేవాలయాల్లో దర్శనమిస్తున్నారు. చలి ఎక్కువగా ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి.. మాకు ఏమీ కాదులే అనుకుంటే తప్పులో కాలేసినట్లే. చలి తీవ్రత రోజుకు పెరుగుతున్నందున పిల్లలను మొదలుకొని పెద్దల వరకు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే..

### మార్నింగ్ వాకింగ్ ఆలస్యం...

తెల్లవారుజాము నుంచే రోడ్లపై వాకింగ్ చేసేవారు చలి నేపథ్యంలో ఆలస్యంగావాకింగ్ చేస్తున్నారు. చలి తీవ్రత పెరిగినందున ఎండ వచ్చిన తర్వాతే వాకింగ్ ప్రారంభిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రజలు రోగాల పాలవుతున్నారు. ఎవరికి ఎలాంటి జబ్బులు వస్తున్నాయో చెప్పలేని పరిస్థితులు. వయసుతో సంబంధం లేకుండా చాలామంది వాకింగ్ చేస్తున్నారు. జిమ్ములకు వెళ్తున్నారు. వాకింగ్ చేసేవాళ్లు స్వెటర్లు వేసుకొని ఆలస్యంగా వెళుతున్నారు. చలి తీవ్రత కారణం గా చలి మంటలు వేసుకుంటున్నారు. చలి పెరిగిన నేపథ్యంలో ఎండ వచ్చేంతవరకు చాలామంది ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు.. మరికొన్ని రోజుల పాటు జాగ్రత్తలు తీసుకుంటే ఈ సీజన్లో గట్టెక్కినట్లే.

### వాహనదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే...

చలి నేపథ్యంలో పొగ మంచు తీవ్రత పెరిగింది. రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా పొగ మంచు ప్రభావం కనిపిస్తుంది. ఈ తరుణంలోవాహనదారులు అప్రమం తంగా ఉండాల్సివస్తుంది. వీలైనంతవరకు తెల్లవారు జాము ప్రయాణాలు తగ్గించుకుంటే మంచిదని నిపుణు లు చెబుతున్నారు జాతీయ రహదారు లు. ఔటర్ రింగ్ రోడ్డుపై పొగ మంచుతో ముందు ఉన్న వాహనాదారులు కనిపించని పరిస్థితులు నెలకొన్నాయి. వీటిపై వాహనదా రులు వేగడం వేగంగా వెళ్లడం వల్లనే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పొగ మంచు కురుస్తున్న సమ యంలో వాహనదారులు జాగ్రత్తగా నడిపించడంతో పాటు వాహనాన్ని కండిషన్ లో ఉంచుకోవాలని. శీతాకాలంలో జరుగుతున్న ప్రమాదాలతో ఔటర్ రింగ్ రోడ్డు పైన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని దీనికి ప్రధాన కారణం వాహనదారులు వేగంగా వెళ్లడమే నాని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో లైట్లు వేసుకొని మెల్లగా వెళ్లాలని పోలీసులు స్పష్టమైన సూచన చేస్తున్నారు. వేగంగా వెళ్లడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు.





### ప్రభలుతున్న వ్యాధులు...

ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు వ్యాధుల పాలవుతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల కనిష్ట స్థాయికి చేరడంతో దీన్ని ప్రభావం పిల్లలు. వృద్ధులపై తీవ్రంగా పడుతున్నాయి. రైతులు తెల్లవారుజాము నుంచే పొలాల పనులకు వెళ్తుంటారు. జలుబు. దగ్గు. గొంతు నొప్పి. ఫ్లూ జ్వరం. ఆయాసం. స్వైన్ ఫ్లూ వంటి రోగాలు వస్తున్నాయి. అస్తమా. అలర్జీ. నిమోరియా వంటి సమస్యలు ఉన్నవారికి మరింత ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉంది. డాక్టర్ల సలహాలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఉదయం పూట వాకింగ్ కు వెళ్లేవారు సమయం మార్చుకోవాలని వైద్య నిపుణులు సలహాలు ఇస్తున్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి ఈ చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్తే మాత్రం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్తున్నారు. ముక్కు.. చెవిలు. తలభాగం కప్పుకొని వెళ్లాలని వైద్యులు తేల్చి చెబుతున్నారు.

## కస్తూర్బాలో విద్యార్థులతో కలెక్టర్ సహపంక్తి భోజనం



**వారధి న్యూస్, వనపర్తి:** జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం సాయంత్రం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ కూడా ఉన్నారు. కళాశాలలో వంటకాలను పరిశీలించిన కలక్టర్, వంటలో వేసిన కూరగాయలు, మెనూ ప్రకారం వంట చేసినందుకు సంబంధించిన వివరాలను అడిగారు. "వంటకు ఏ నీళ్లు వాడుతున్నారు?" అని ఆరా తీశారు. విద్యార్థులు చేతులు, ప్లేట్లను కడిగే స్థలంలో సబ్బులు ఉంచారా అన్నది కూడా తనిఖీ చేశారు. తనిఖీ తర్వాత, కలక్టర్ మరియు అదనపు కలెక్టర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తరగతులు, వంటకాలు, ఇతర ఇబ్బందులపై విద్యార్థులతో ముచ్చటించారు. "మీలో ఎవరైనా ఐ.ఐ.టీ. లో సీటు సంపాదిస్తే, నేను మీ ఇంటికి భోజనానికి పిలుస్తాను" అని కలక్టర్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి పి. సీతారాం, జి.సి.డి.ఓ శుభలక్ష్మి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## నిందితుడికి జైలు శిక్ష, జరిమానా

**వారధి న్యూస్, ఆత్మకూర్ :** అమరచింతకు చెందిన బోయ రాధమ్మ తన భర్త మార్క కృష్ణమూర్తి శారీరక, మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని 2017లో క్రైమ్ నెంబర్ 16/2017 కింద అమరచింత పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఈ కేసు 498-, 494 ఐపీసీ సెక్షన్లు, డౌరీ ప్రహిబిషన్ యాక్ట్ 1961 (34) ప్రకారం దర్యాప్తు చేయబడింది. అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జమీరుద్దీన్ హెడ్ కానిస్టేబుల్ ప్రాథమిక విచారణ పూర్తిచేసి, సబ్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. శుక్రవారం ఆత్మకూర్ కోర్టు ఇంచార్జ్ జడ్జి జానకి నిందితుడైన మార్క కృష్ణమూర్తికి 3 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 2,000 జరిమానా విధించారు. కేసులో ప్రభుత్వ లాయర్ అరుణోదయ కుమార్ బాధితుల తరపున బలమైన వాదనలు వినిపించి నిందితుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించారు. ఈ విజయం పట్ల వనపర్తి జిల్లా ఎస్పీ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్ను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా సీడీవో బాలరాజు మరియు ప్రస్తుత అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ బి. సురేష్ సేవలను ప్రశంసించారు. బి. సురేష్ ప్రజలను ధైర్యంగా ముందుకు వచ్చి న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి

# జగదీశ్ చంద్ర



మన దేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటి చెప్పిన మేటి శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్. రేడియో విజ్ఞానంలో పితామహునిగా పేర్కొంటారు. ఒక అసాధారణ వ్యక్తి. భౌతిక శాస్త్రవేత్తగా, జీవ శాస్త్రవేత్తగా, జీవ భౌతిక శాస్త్రవేత్తగా, వృక్ష శాస్త్రవేత్తగా, పురావస్తు శాస్త్రవేత్తగా జగద్విఖ్యాతి పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞాన%అ%ఖని బోస్. సైన్స్ ఫిక్షన్లను కూడా రచయిత కూడా. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్ తో వృక్షశాస్త్రంలో గణనీయ ఫలితాల్ని సాధించిన బోస్ 1904లో అమెరికా నుంచి పేటెంట్ హక్కులు పొందిన తొలి శాస్త్రవేత్త, 1858 నవంబర్ 30న బెంగాల్ ప్రావిన్స్ (నేటి బంగ్లాదేశ్)లోని మున్సిగంజ్ లో 1858 నవంబర్ 30 న బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో ప్రభుత్వంలో అసిస్టెంట్ కమిషనర్, బ్రహ్మ సమాజ్ సభ్యుడు భగవాన్ చంద్రబోస్‌కు ఆయన జన్మించాడు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా పెరిగిన అతని తండ్రి ఇంగ్లీష్ నేర్చుకునే ముందు బెంగాలీ నేర్చుకోవాలని అనుకున్నాడు. అతను ఒక స్థానిక పాఠశాలలో చదివాడు, అక్కడ అతని క్లాస్‌మేట్స్ విభిన్న వర్గాలు మరియు మతాలకు చెందినవారు. అతను కలకత్తాలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో చేరాడు. అక్కడ జెస్యూట్ పూజారి ఫాదర్ యూజీన్ లాఫాంట్ ద్వారా సహజ శాస్త్రాలపై ఆసక్తిని పెంచు కున్నాడు. ప్రాథమిక విద్య సమయంలో బోస్ వద్ద - ముస్లిం నౌఖరు కుమారుడు కుడివైపున, మత్స్య కార్మికుని కుమారుడు ఎడమ వైపున కూర్చునే వారు. వారు చెప్పే పశు పక్ష్యాదుల కథలను బోస్ శ్రద్ధగా వినేవాడు. ప్రకృతిలోని జీవాలపై పరిశోధనాసక్తి కలగడానికి తన స్నేహితుల కథలే అంకురార్పణ చేశాయని ఆయన చెప్పేవారు. కలకత్తాలోని సెయింట్ జేవియర్ కళాశాల నుండి డిగ్రీ పూర్తి చేసి, వైద్య విద్య అభ్యసించేందుకు ఆయన లండన్ వెళ్లాడు. ఆరోగ్యం సహకరించని కారణంగా అక్కడ విద్యాభ్యాసం కొనసాగించలేక తిరిగి భారత దేశానికి చేరు కొ న్నారు. తర్వాత బోస్ ఇంగ్లాండ్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయాలని అనుకున్నాడు. కాని మనసు మార్చుకుని తన బావ ఆనందమోహన్ బోస్ సిఫార్సుపై కేంబ్రిడ్జ్‌లో నేచురల్ సైన్స్ చదివాడు. అక్కడ ఆయనకు ప్రముఖ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్ డార్విన్, జేమ్స్ దేవర్ మరియు మైఖేల్ ఫోస్టర్ బోధించాడు. ఆయన ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ప్రఫుల్లా చంద్రరేతో స్నేహం చేశాడు. తరువాత ఆయన రసాయన శాస్త్రవేత్తగా కీర్తిని పొందాడు. కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యునిగా చేరాడు. జాతి వివక్ష పరాకాష్ఠకు చేరిన ఆ విద్యాసంస్థలో తన ఉద్యోగంలో జాత్యహంకారాన్ని ఎదుర్కొన్నాడు, అయన జీతం బ్రిటిష్ సహచరుల కంటే చాలా తక్కువ. బోస్ మూడేళ్లపాటు జీతం తీసుకోకుండా బోధించడం ద్వారా నిరసన తెలుపుతూ, తగినన్ని సౌకర్యాలు ఆర్థిక సాయం అందకున్నప్పటికీ పట్టుదలతో పరిశోధనలను కొనసాగించాడు. తరువాత, కళాశాల ఆయన నియామకాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. జీతం బకాయిలను చెల్లించింది. 1917 లో, కలకత్తాలో బోస్ ఇన్స్టిట్యూట్ను స్థాపించాడు. అక్కడ శాస్త్రవేత్తలు మొక్కలపై పరిశోధనలు జరిపారు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్లను మొట్టమొదటి సారిగా వాడిన బోస్ వైర్లెస్ సిగ్నలింగ్ పరిశోధనలో అత్యద్భుత ప్రగతిని సాధించ గలిగాడు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్థవాహక జంక్షన్ లను మొట్టమొదటి సారిగా వాడిరది బోసే. 1901 లో రాయల్ సొసైటీ ఆఫ్ లండన్‌లో బోస్ నిర్వహించిన ఒక ప్రసిద్ధ ప్రయోగం, మనుషుల మాదిరిగానే మొక్కలకు కూడా భావాలు ఉన్నాయని తేలింది. ఆయన ఒక మొక్కను బ్రోమైడ్ ద్రావణాన్ని కలిగి ఉన్న పాత్రలో ఉంచాడు, ఇది విషపూరిత మైనది. తన పరికరాన్ని ఉపయోగించి, మొక్క విషానికి ఎలా స్పందిస్తుందో తెరపై చూపించాడు. తెరపై వేగంగా, కదలికను చూడగా, అది చివరికి చనిపోయింది. ఒక జంతువును విషంలో ఉంచితే ఇలాంటిదే జరిగి ఉండేది. విషం కారణంగా మొక్క చనిపోయింది. బోస్ తన ఇన్స్టుమెంట్ ను క్రెస్కోగ్రాఫ్ అని పిలిచాడు. మరిన్ని ప్రయోగాలు చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆయన కనుగొన్న వాటిని ప్రశంసించారు. వ్యాపార దృష్టి ఏ మాత్రం లేని బోస్ తన పరిశోధనలను ఇతర శాస్త్రవేత్తలు వినియోగించుకుని, వాటి ఆధారంగా మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలనే సదుద్దేశంతో తన పరిశోధనలను బహిర్గత పరిచాడు. ప్రధానంగా తాను కను గొన్న క్రెస్కోగ్రాఫ్ సాయంతో వివిధ పరిస్థితులలో మొక్కల స్పందనను పరి శోధనాత్మకంగా నిరూపించాడు. జంతువుల, వృక్షాల కణజాలాలలో సమాంతర పరిశోధనలు చేసి ఉపయోగ కరమైన ఫలితాలు సాధించాడు. రేడియో తరంగాలను గుర్తించడానికి ఉపయోగించే కోహెరర్ అనే పరికరాన్ని మెరుగు పరిచాడు. 1887 లో, బ్రహ్మ సమాజ్ సంస్కర్త దుర్గా మోహన్ దాస్ కుమార్తె అబాలాను వివాహం చేసుకున్నాడు. 1896 లో, రేడియో తరంగాలపై పరిశోధన చేస్తున్న గుగ్లిఎల్మో మార్కోనిని కలిశాడు. జగదీష్ చంద్రబోస్ వైర్‌లెస్ టెలిగ్రాఫీని కనుగొన్నాడు. 1895 లో ప్రదర్శనను కూడా నిర్వహించాడు, కాని ఆయన పేటెంట్ కోసం దాఖలు చేయలేదు. మరోవైపు ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1897 లో బోస్ ప్రదర్శన తరువాత రెండు సంవత్సరాల అనంతరం ఇదే విధమైన ప్రదర్శన చేసాడు, కాని మార్కోని 1896 లో పేటెంట్ కోసం దాఖలు చేశాడు. కాబట్టి, బోస్ ఈ రంగంలో మార్గదర్శక పని చేసినప్పటికీ, మార్కోనీ ఈ ఆవిష్కరణకు ఘనత పొందాడు. 1937 నవంబర్ 23న తన 78వ ఏట బోస్ అవిభక్త భారతావని లోని బెంగాల్ ప్రావిన్స్ లోని నేటి జార?ండ్‌లోని గిరిడీలో కన్ను మూశాడు. బోస్ మరణించిన 80 సంవత్సరాల అనంతరం కూడా ఆయన చేసిన కృషి అందించిన గణనీయ సేవలు, సాధించిన ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది అనునిత్యం గుర్తు చేసుకుంటునే ఉన్నారు.

## స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

### ఎం.ఎస్సి వృక్షశాస్త్రంలో చేరాలనుకునే వారికి అవకాశం

**వారధి న్యూస్, జడ్చర్ల :** బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ఎంఎస్సి వృక్షశాస్త్రం కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ గడువును 26 నవంబర్ 2024 వరకు పొడిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఒక ప్రకటనలో, ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసినవారికి, అలాగే రాయని విద్యార్థులకు కూడా ఎం.ఎస్సి వృక్షశాస్త్రం కోర్సులో చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు. డిగ్రీ లో వృక్షశాస్త్రం సబ్జెక్టు చదివి కనీసం 50% మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సులో చేరవచ్చు. ఆసక్తిగల విద్యార్థులు 26.11.2024 వరకు వృక్షశాస్త్ర విభాగాన్ని సంప్రదించవచ్చని, 9963536233 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

# దేశాభివృద్ధికి ప్రసారాల చేయూత




ప్రసార భారతి అనేది భారతదేశ అతిపెద్ద ప్రసార సంస్థ. దీని ప్రధాన కార్యాలయం న్యూ ఢల్లీ లో ఉంది. ఇది పార్లమెంటు ద్వారా ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి సంస్థ. దూరదర్శన్, టెలివిజన్ నెట్వర్క్, ఆల్ ఇండియా రేడియోలను కలిగి ఉంటుంది. బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూల్కె 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది. 1927 జూల్కె 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927. ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తి లోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశ వాణి ప్రపంచం లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ అధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార యంత్రాంగం ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. ప్రసార భారతి చట్టంను పార్ల మెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన తరువాత 1990 సెప్టెంబర్ 12 న భారత రాష్ట్రపతి అంగీకారం పొందింది. ఇది చివరకు నవంబర్ 1997 లో అమలు చేయబడిరది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలో 1997 నవంబరు 23న స్థాపించ బడిరది. ప్రసార భారతి చట్టం, 1990లో పేర్కొన బడిన ప్రసార భారతి కార్పొరేషన్ సంబంధిత ప్రధాన లక్ష్యాలు... దేశ ఐక్యతను, సమగ్రతను, రాజ్యాంగం ప్రసాదిం చిన విలువలను నిలబెట్టడం. జాతీయ లేదా అంతర్జాతీయ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అన్ని విషయాలపై స్వేచ్ఛగా, నిజాయితీగా మరియు నిష్పక్ష పాతంగా తెలియ జేయడానికి పౌరుడి హక్కును పరిరక్షించడం మరియు దాని స్వంత అభిప్రా యాన్ని లేదా భావజాలాన్ని సమర్థించకుండా విరుద్ధమైన అభిప్రాయాలతో సహా సరసమైన మరియు సమతుల్య సమా చారాన్ని అందించడం. జాతీయ సమైక్యతను ప్రోత్సహించ డానికి, అక్షరాస్యత, వ్యవసాయం, గ్రామీణా భివృద్ధి, పర్యావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో విద్య మరియు వ్యాప్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం. మహిళల సమస్యలపై అవగాహన కల్పించడం మరియు సమాజంలోని పిల్లలు, వృద్ధులు మరియు ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం. విభిన్న సంస్కృతులు, క్రీడలు మరియు ఆటలు మరియు యువత వ్యవహారాలకు తగిన కవరేజీని అందించడం. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం, శ్రామిక వర్గాలు, మైనారిటీలు మరియు గిరిజన వర్గాల హక్కులను పరిరక్షించడం. పరిశోధనను ప్రోత్సహించడానికి మరియు ప్రసార సాంకేతికతలో బ్రాడ్కాస్టింగ్ ఫ్యాకల్టీలను అభివృద్ధిని విస్తరించడం లక్ష్యాలుగా ప్రసార భారతి స్థాపన జరిగింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి చట్టం ద్వారా, అన్ని ఆస్తులు, అప్పులు, బాధ్యతలు, చెల్లించాల్సిన డబ్బు చెల్లింపులు, అలాగే ఆకాశవాణి, దూరదర్శన్ లు అన్ని చట్టపరమైన చర్యలు ప్రసార భారతికి భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ అనువర్తింప జేసింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, ఢల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 ఆకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాలతో 99.13 శాతం ప్రజలకు ప్రస్తుతం సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. దూరదర్శన్ ఇండియా, దూరదర్శన్ అంతర్జాతీయ ఛానెల్ డిడి ఇండియా 37 దేశాలలో అందుబాటులో ఉంది. ఇది ఇప్పుడు యున్కెటెడ్ స్టేట్స్ లోని హాట్స్టార్, ఐటివి ప్లాట్ఫారమ్లలో కూడా అందు బాటులో ఉంది. న్యూస్ ఆన్‌ఎయిర్ యాప్, యాప్2 మిలియన్ కంటే ఎక్కువ డౌన్లోడ్లను కలిగి ఉంది. ఇది 270 కంటే ఎక్కువ రేడియో, టీవీ ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తుంది. డిడి ఫ్రీ డిష్ దేశంలోనే అతిపెద్ద డిటిహెచ్ ఆపరేటర్ 40 మిలి యన్లకు పైగా గృహాలకు చేరువైంది. ప్లాట్ఫారమ్లో 50ప్లస్ అంకితమైన విద్యా ఛానెల్లతో సహా 116 టివి ఛానెళ్లు ఉన్నాయి. 2020- 21లో రూ.700 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించింది. ప్రసార భారతి న్యూస్ సర్వీసెస్ టెలిగ్రామ్ ఛానెల్, ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా ప్రసార భారతి డిజిటల్ న్యూస్ వింగ్గా స్థిరపడిరది. దీని ట్విట్టర్ హ్యాండిల్కు వంద కెప్లస్ అనుచరులు న్నాయి. టెలిగ్రామ్ ఛానెల్కు 15కె ప్లస్ వినియోగ దారులున్నారు. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశవ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92 శాతం మొత్తం జనాభాలో 99.19శాతానికి చేరుకుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగుతున్నాయి.

# పొగసూరుతున్న జీవితాలు



3.4 కోట్ల జనాభా కలిగిన ఢల్లీవాసుల ఊపిరితిత్తులు పొగసూరుతున్నాయి. గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కోరలు చాచడంతో వర్క్ ఫ్రమ్ హోమ్, విద్యాలయాలు మూసివేసి ఆన్‌లైన్ క్లాసులను తెరవడం, సగం మందితో కార్యాలయాల నిర్వహణ, వాహనాల క్రమబద్ధీకరణ, కృత్రిమ వర్షాలతో విషతుల్యమైన స్మోగ్ (స్మోక్ ం ఫాగ్) తీవ్రతను తగ్గించడానికి ప్రయత్నాలు, భవన నిర్మాణాల నిలిపివేతలు, విమాన రాకపోకలకు ఇబ్బందులు, చీపుర్లతో ఊడ్వకుండా తడి గుడ్డలతో తుడవడం, వాటర్ ట్యాంకర్లతో నీటిని చల్లించడం, అనవసర వాహన రద్దీని నియంత్రించడం, వ్యాపార సముదాయాల పని సమయాల్లో కోతలు, ప్రజలు బయట తిరగవద్దని హెచ్చరికలు చేయడం లాంటి అసాధారణ చర్యలకు ప్రభుత్వాలు పూనుకోకతప్పని పరిస్థితులు అనివార్యం కావడం విచారకరం. గత వారంలో గాలి నాణ్యత సూచీ (ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్) ఏడాది గరిష్ట స్థాయి 493కి చేరడం చూసాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం సురక్షిత స్థాయి 15 వరకు మాత్రమే ఉండాలి. కాని దాని కన్న 30 రెట్లు అధికంగా పిఎం-2.5 కాలుష్య సూచీ చూపడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. ప్రతి ఏట శీతాకాల సీజన్ అక్టోబర్ - నవంబర్ నుంచి ఇలాంటి గాలి కాలుష్య భూతం మహానగరాలతో పాటు ఢల్లీ వాసులకు నరకం చూపిస్తున్నది. గాలి నాణ్యత సూచీ లేదా ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200 దాటితే 'పూర్' అని, 300 దాటితే 'వెరీ పూర్' అని, 400 దాటితే అత్యంత ప్రమాదకరమని వైద్యులు వర్గీకరిస్తారు. ఢల్లీ లాంటి అధిక గాలి కాలుష్య పరిస్థితులు గుర్‌గావ్, పాట్నా, జైపూర్, లక్నో, హైదరాబాదు, ఘాజియాబాద్?, కొల్‌కతా, ముంబాయి, బెంగళూరు, హైదరాబాదు లాంటి నగరాల్లో కూడా కొంత వరకు గమనించడం జరిగింది. భారత్‌లో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సగానికి పైగా జరగడం, అపరిమిత వాహనాలు విడిచే పొగ, నిర్మాణరంగ ధూళి, పరిశ్రమలు వదిలే పొగలు, సమీప రాష్ట్రాల్లో వ్యవసాయ వ్యర్థాలను బహిరంగంగా కాల్చి వేయడం, పర్వదినాల్లో బాణాసంచా కాల్చడం లాంటి పలు కారణాలతో నగరాలు గాలి కాలుష్య కోరల్లో విలవిల్లాడుతున్నాయి. మహానగర వాసులు ఈ కలుషిత గాలిని పీల్చడంతో ఊపిరితిత్తులు దెబ్బతినడం వల్ల పిల్లలు, పెద్దలకు శ్వాస ఇబ్బందులు/హృదయ సంబంధ అనారోగ్యాలు కలుగుతున్నాయి. నేటి భారత మహానగరాల గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికలు ఏమీ అమలు పరచడం లేదు. తాత్కాలిక ఉపశమన చర్యలే తప్ప శాశ్వత పరిష్కార దిశగా ఎలాంటి పటిష్ట అడుగులు పడడం లేదు. ఢల్లీలో పరిస్థితులు మరో విధంగా, హాస్యాస్పదంగా మారిపోతున్నాయి. ఢల్లీ రాష్ట్ర ఆప్ ప్రభుత్వం, కేంద్ర భాజపా ప్రభుత్వాలు ఒకరి మీద మరొకరు కాలుష్య బురదను చల్లుకోవడం, మీరు చేయాలంటే మీరని వాదనలు చేయడానికి మాత్రమే పరిమితం అవుతున్నారు. తక్షణ ఉపశమనానికి కృత్రిమ వర్షాలు లేదా క్లౌడ్ సీడిరగ్ పద్ధతిలో వానలు కురిపించే ప్రయత్నాలు వెంటనే చేయాలని నగరవాసులు కోరుతున్నారు. శిలాజ ఇంధన వాహనాలను నియంత్రించడం, ఈవీ వాహనాలను ప్రోత్సహించడం, పరిశ్రమలను నగరాల నుంచి తరలించడం, నిర్మాణ రంగాలకు తాత్కాలిక సెలవులు ప్రకటించడం, వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతలను నిషేధించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం, బొగ్గు ఆధార విద్యుత్తు/ఇతర ఉత్పత్తులకు బ్రేకులు వేయడం, వంట చెరుకు/బొగ్గు/పిడకలతో వంటలు చేయడాన్ని తగ్గించడం, చలి మంటలను అదుపు చేయడం, హరిత క్షేత్రాలను పెంచడం లాంటి పటిష్ట చర్యలు అమలు పరిస్తే కొంత వరకు నగరవాసులకు ఊపిరి పీల్చడం తేలికవుతుందని తెలుసుకోవాలి. మహానగరాలు కాలుష్య కేంద్రాలుగా మారి మరింత ప్రమాదకర స్థాయికి చేరక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిచి శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలను త్రికరణశుద్ధిగా చేపట్టాలి. ప్రభుత్వం ఏద్కెనా ప్రమాదంలో పడుతున్నది ప్రజలే అని గమనించాలి. పరిస్థితులు మరింత విషమించకుండా తక్షణమే మహానగర అభాగ్యులకు ఆయురారోగ్యాలను ప్రసాదించడానికి ప్రభుత్వాలు, నగర ప్రజలు నడుం బిగించాలి. మన ఆరోగ్యం అన్నింటి కన్న ప్రధానమని తెలుసుకొని వివేకంతో, విచక్షణతో అడుగులు వేద్దాం, నగరాలను ఆవాస ప్రదేశాలుగా పునర్ నిర్మించుకుందాం.




## యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరుదుగా దొరికే ఎబి నెగిటివ్ రక్త దానము

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అరుదుగా దొరికే ఎబి నెగిటివ్ రక్తం అవసరమైన ఒక వ్యక్తికి త్వరితగతిన రక్తదానం చేసిన ఘటనా వెలుగు చూసింది. పాలమూరు జిల్లా నవాబ్ పేట్ మండలానికి చెందిన అరుణ అనారోగ్యంతో పాలమూరు జిల్లా గవర్నమెంట్ హాస్పిటల్లో అడ్మిట్ అయ్యారు. ఆమెకు రక్తం కొరత కావడంతో, వైద్యులు ఆమె పరిస్థితి ప్రమాదకరమైనట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మరియు హైదరాబాద్ చిరంజీవి బ్లడ్ బ్యాంకుల్లో కూడా రక్తం దొరకకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ ను ఆశ్రయించారు. ఈ సమయంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు ఫౌండేషన్ సభ్యులతో పాటు స్పందించి, నారాయణపేట్ జిల్లా గంగాధర్ అనే వ్యక్తితో రక్తదానం నిర్వహించారు. ఈ చర్య వల్ల అరుణకు ప్రాణదానం జరిగింది. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు, గంగాధర్, రాము, వెంకటేష్, నరేష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

9
శుక్రవారం
22.11.2024
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
HEALTH ఆరోగ్యం

# షుగర్ పేషెంట్లకు ఈ ఆకు ఒక వరం



రోజూ ఒక జామకాయ తినటం చాలా మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా డయాబెటిస్ వ్యాధిత్ బాధపడుతున్నవారు కచ్చితంగా రోజూ జామకాయ తినమని సూచిస్తున్నారు. అంతేకాదు.. జామకాయను పేదవాడి యాపిల్‌గా పిలుస్తారు. పోషకాలు పుష్కలంగా ఉండి, అందరికీ అందుబాటు ధరలో లభిస్తుంది జామకాయ. కేవలం జామ కాయలే కాదు జామ ఆకులతో కూడా ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అన్ని కాలాల్లో అందుబాటులో ఉండే, ఈ జామ ఆకులను తినడం వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం ద్వారా అనేక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల్లో ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, డ్కెటరీ మినరల్స్, పొటాషియం, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున జామ ఆకులను నమలడం వల్ల బెల్లీ ఫ్యాట్ తో పాటు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం ద్వారా అనేక వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చు. జామ ఆకుల్లో ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, డ్కెటరీ మినరల్స్, పొటాషియం, కాపర్, మాంగనీస్ పుష్కలంగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున జామ ఆకులను నమలడం వల్ల బెల్లీ ఫ్యాట్ తో పాటు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. జామ ఆకులను రోజూ తీసుకోవడం వల్ల మధుమేహంలో మేలు చేస్తుంది. బ్లడ్‌షుగర్ అదుపులో ఉంటుంది. దీనిలో ఉండే ఫినోలిక్ రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. జామ ఆకు రసంలో ఉండే యాంటీ హైపర్ గ్లైసెమిక్ లక్షణాలు రక్తంలో చక్కెరను కూడా నియంత్రిస్తాయి. పరగడుపున జామ ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియకు మేలు చేస్తుంది. జామ ఆకుల్లో డ్కెటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులను నమలడం వల్ల అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్, ఎసిడిటీ వంటి కడుపు సమస్యలు వచ్చే అవకాశం తక్కువ. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కూడా జామ ఆకులను ప్రతిరోజూ పరగడుపున తీసుకుంటే ఇమ్యునిటీ పెరుగుతుంది. జలుబు, దగ్గు, తలనొప్పి, జ్వరం లాంటి చిన్న చిన్న సమస్యలను చాలా సులువుగా అధిగమించేలా రోగనిరోధకశక్తి పెంచుతుంది. జామ ఆకులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. జామ ఆకులను ఉదయాన్నే ఖాళీ కడుపుతో పొట్టతో నమిలితే ఎక్కువ ప్రయోజనాలు శరీరానికి అందుతాయంటున్నారు నిపుణులు. ఇందుకోసం ఆ ఆకులను రెండు నిమిషాలపాటూ నీటిలో నానబెట్టాలి. ఆ ఆకులపై ఉన్న మురికి పోతుంది. అలా శుభ్రంగా కడిగిన తరువాత రెండు ఆకులను నమలడం మంచిది. ఆ సారాన్ని మింగేస్తే ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది.

# బ్రెయిన్ స్ట్రోక్ వచ్చేముందు కనించే లక్షణాలు



ప్రతి

జీవనశ్కెలి వ్యాధుల్లో బ్రెయిన్ స్ట్రోక్ ఒకటి. ఇది రావడానికి ముందు మన శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే ప్రమాదం నుంచి బయటపడొచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. మెదడులోని ఒక భాగంలో రక్తప్రసరణ సరిగ్గా జరగనప్పుడు స్ట్రోక్ వస్తుంది. దీని లక్షణాలను ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. యున్కెటెడ్ స్టేట్స్‌లో సంభవిస్తున్న అధిక మరణాల్లో స్ట్రోక్ ప్రధాన కారణం. మెదడులోని ఒక భాగంలో రక్తప్రసరణ సరిగ్గా జరగనప్పుడు స్ట్రోక్ వస్తుంది. దీని లక్షణాలను ముందుగా గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం.. యున్కెటెడ్ స్టేట్స్‌లో సంభవిస్తున్న అధిక మరణాల్లో స్ట్రోక్ ప్రధాన కారణం. ప్రతి సంవత్సరం 795,000 కంటే ఎక్కువ మంది అమెరికన్లు స్ట్రోక్‌తో బాధపడుతున్నారు. మెదడు కణాలు, కణజాలం దెబ్బతినడం వల్ల నిమిషాల్లో మరణిస్తున్నారు. అందువల్ల స్ట్రోక్ లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం. మెదడులో రక్తం సరఫరా సరిగా లేకపోవడం వల్ల కణజాలం, కణాలు దెబ్బతింటాయి. ఇది స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. దీని వల్ల శరీరంలోని ఇతర అవయవాలు కూడా దెబ్బతింటాయి. స్ట్రోక్‌తో బాధపడుతున్న వ్యక్తికి ఎంత త్వరగా చికిత్స అందిస్తే, అంత మెరుగ్గా ఆరోగ్యం ఉంటుంది. సరైన జీవనశ్కెలి, ఆహారపు అలవాట్ల కారణంగా అనేక రకాల నరాల వ్యాధులు సంభవిస్తున్నాయి. వాటిల్లో మైగ్రేన్లు, స్ట్రోక్స్, మూర్ఛలు, అనేక రకాల క్యాన్సర్లు, మెదడు కణితులు వంటివి వస్తున్నాయి. నేటి కాలంలో ఇవి చాలా సాధారణమైపోయాయి. ప్రతి సంవత్సరం 40 నుండి 50 వేల మంది బ్రెయిన్ ట్యూమర్‌తో మరణిస్తున్నారు. భారతదేశంలోని యువతలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత 5 సంవత్సరాలలో 25 శాతం పెరిగాయి. చాలా కేసులు 25-40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులలో సంభవిస్తున్నాయి. బ్రెయిన్ స్ట్రోక్ వైపు మాత్రమే కాకుండా షుగర్, హై బీపీ వంటి జీవనశ్కెలి వ్యాధులు కూడా పెరుగుతున్నాయి. నిద్రలేమి, గుండె సంబంధిత వ్యాధులు, అధిక రక్తపోటు, ఒత్తిడి, టెన్షన్ వంటి అనేక సమస్యలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి. వాయు కాలుష్యం కూడా బ్రెయిన్ స్ట్రోక్‌కు కారణం అవుతున్నాయి. తలకు ఎలాంటి గాయాలు కాకుండా చూసుకోవాలి. అలాగే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ధూమపానం, ఒత్తిడిని నివారించాలి. సాధారణ వ్యాయామం కూడా చాలా అవసరం. వ్యాయామం, నడక మధుమేహం, ఊబకాయం, హై బీపీ, డ్స్లిపిడెమియా మొదల్కెన వ్యాధుల నుంచి కాపాడుతుంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నరాల సంబంధిత వ్యాధులు దూరమవుతాయి. భారతదేశంలో ప్రతి సంవత్సరం 1 లక్షా 85 వేలకు పైగా బ్రెయిన్ స్ట్రోక్ కేసులు నమోదవుతున్నాయి. ప్రతి 40 సెకన్లకు ఒకరు స్ట్రోక్‌కు గురవుతున్నారు.



# టైం లేదని బాత్రూంకి వెళ్లకుండా వాయిదా వేస్తున్నారా?

నేటి బిజీ లైఫ్ స్టైల్ వల్ల చాలా మందికి ఉదయాన్నే సరిపడినంత సమయం ఉండటం లేదు. దీనితో కనీసం ప్రశాంతంగా బాత్రూంకి కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ అలవాటు అంత మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. బిజీ ల్కెఫ్‌లో ఉదయం పూట టాయిలెట్‌కి వెళ్లేందుకు కూడా చాలా మందికి సమయం సరిపోదు. ఉదయం నిద్రలేచిన వెంటనే మలవిసర్జన చేయడం ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇది మన ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చాలా మందికి తెలియదు. బాత్రూమ్‌కి వెళ్లేందుకు సమయం లేకపోవడం చాలా మంది వాయిదా వేస్తుంటారు. ఈ అలవాటు అంత మంచిదికాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పనిచేసే కార్యాలయంలో అపరిశుభ్రత కారణంగా ఆఫీసు మరుగుదొడ్లను ఉపయోగించడం చాలా మందికి అసౌకర్యంగా ఉంటుంది. దీంతో వారు మలమూత్రాలను బలవంతంగా ఆపేస్తుంటారు. ఇది వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని పలువురు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో ఇక్కడ తెలుసుకుందాం.. తరచుగా మూత్రాన్ని నిలుపుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. కొంతమంది పరిశుభ్రత కారణాలతో బహిరంగ మరుగుదొడ్లను ఉపయోగించడానికి ఇష్టపడరు. ఇలాంటి వారికి అనుకూలమైన వాతావరణం ఉండాలి. దీంతో వారు బాత్రూంకి వెళ్లరు. కాలక్రమేణా ఇదే అలవాటుగా మారుతుంది. అయితే కడుపులోని ప్రేగులు కూడా ఈ అలవాట్లకు అంతరాయం కలిగిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఉబ్బరం, మలబద్ధకం కాకుండా, రెక్టల్ ప్రోలాప్స్‌కు కూడా కారణవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రెక్టల్ ప్రోలాప్స్.. పురీషనాళం దిగువ భాగం, పెద్ద ప్రేగు దిగువ భాగం, జీర్ణవ్యవస్థ చివరిలో కండరాలు వెలుపలకు జారిపోయినప్పుడు సంభవిస్తుంది. ఇది తీవ్రమైన నొప్పి, అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ఎక్కువ సమయం కడుపులో మూత్ర విసర్జన చేయకుండా నిలుపుకుంటే ఈ సమస్య సంభవిస్తుంది. దీంతో బాత్రూంకి వెళ్లినప్పుడు తీవ్రమైన నొప్పులతో పాటు మలద్వారం చుట్టూ పగుళ్లు ఏర్పడతాయని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులలో కూడా అధిక ఒత్తిడి రక్తపోటును పెంచుతుంది. కాబట్టి ఇది మరింత ప్రమాదకరం. ఇది గుండెపోటు లేదా స్ట్రోక్‌కి కూడా దారితీయవచ్చు. ఎందుకంటే హేమోరాయిడ్ రోగులలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం కనీసం 27 శాతం ఎక్కువగా ఉంటుందని అధ్యయనం చెబుతోంది. హేమోరాయిడ్ రోగులలో గుండె జబ్బుల పెరుగుదలకు దారితీసే కారకాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



# ఆరోగ్యానికి మేలు చేసే ఎండు ఉసిరి

ఆరోగ్య సిరి అంటారు..ఎందుకంటే.. ఉసిరి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు పదే పదే చెబుతుంటారు. ఉసిరిని తీసుకోవడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సూచిస్తున్నారు. విటమిన్ సి పుష్కలంగా ఉండే ఉసిరిని రోజూ తీసుకోవటం వల్ల మనలో రోగనిరోధక శక్తి బలపడుతుంది. సీజనల్ వ్యాధుల్కెన జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలకు మంచి చికిత్సగా పనిచేస్తుంది. అంతేకాదు..ఆరోగ్యంతో పాటు అందానికి కూడా ఉసిరి దివ్యౌషధంగా పనిచేస్తుంది. అలాంటి ఉసిరిని సీజన్ వచ్చేసింది. వీటిని పెద్దమొత్తంలో తెచ్చుకుని ముక్కలుగా చేసుకుని ఎండబెట్టి కూడా వాడుకొవచ్చునని నిపుణులు చెబుతున్నారు. ఇలా ఎండిన ఉసిరిని డయాబెటిస్ సహా అనేక వ్యాధులకు సహజ నివారణిగా వాడొచ్చునని చెబుతున్నారు.. ఉసిరిలో ఉండే విటమిన్ సి ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరానికి కావాల్సిన ఐరన్ శోషణలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి, కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. ఉసిరిలోని టానిన్లు రక్తస్రావ నివారిణిగా పనిచేస్తుంది. యాంటీ ఇన్‌ఫ్లమేషన్ లక్షణాలను కలిగి ఉండే సమ్మేళనాలు. ఫైబర్ అధికంగా ఉండి జీర్ణక్రియ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. ఎండు ఉసిరిలోనూ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే పోషకాల గని అంటారు. బాగా ఎండిన ఉసిరిముక్కలు ఏడాది పొడవునా వాడుకోవచ్చు. ఉసిరిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉసిరిలో ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచటంతో పాటు ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి ఇది మెరుగ్గా పనిచేస్తుంది. కొల్లాజన్ కణజాలాన్ని రక్షించి, వృద్ధాప్య లక్షణాలని రాకుండా చూస్తుంది. ఉసిరికాయలలో యాంటీ ఏజింగ్ లక్షణాలతో పాటు, రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు కూడా ఉంటాయి. ఎండిపోయిన ఉసిరి ముక్కల్ని తింటే, వృద్ధాప్య లక్షణాలు తగ్గించుకోవచ్చు. చర్మంపై ఏర్పడే ముడతలు, గీతలు వంటి వృద్ధాప్య సంకేతాలను కూడా తగ్గించడంలో సహాయపడవచ్చు. దీన్ని పొడిగా తయారు చేసుకుని, తేనె కలిపి కూడా తీసుకుంటే చక్కటి ఫలితం ఉంటుంది. చర్మం పై ముడతలు రాకుండా ఉసిరి కాపాడుతుంది. ఉసిరి తీసుకోవటంతో నోటి పూతని తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవాళ్లు కూడా ఉసిరిని వాడడం మంచిది. షుగర్ ఉన్నవాళ్లు ఉసిరిని తీసుకుంటే అది వారికి దివ్య ఔషధంలా పనిచేస్తుంది. అంతే కాకుండా, బరువు తగ్గాలనుకునే వాళ్ళు ఉసిరిని తీసుకుంటే సులభంగా బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది.. ఉసిరిని మనం జ్యూస్ తయారు చేసుకుని కూడా తీసుకోవచ్చు.

# మాటిమాటికీ ఆకలిగా అనిపిస్తుందా?



అనారోగ్యానికి ప్రధాన కారణం చక్కెర అధికంగా తీసుకోవడం. నిపుణులు కూడా అదే అంటున్నారు. అయితే చాలామంది దీనిని పెద్దగా పట్టించుకోరు. దీంతో ప్రతిరోజూ చక్కెర ఆహారాలు అధికంగా లాగించేస్తుంటారు. తద్వారా అధికంగా తీపి మీ శరీరంలోకి ప్రవేశిస్తుంది. తర్వాత అది రకరకాల ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. చక్కెర ఎక్కువగా తినడం వల్ల మరింత ఆకలి వేస్తుంది. ఎందుకంటే ఇది మీ రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. అంతే త్వరగా పడిపోతుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. చక్కెర మీకు తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ మీ రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోయినప్పుడు, అలసిపోయినట్లుగా మారి నీరసంగా అనిపిస్తుంది. అధిక చక్కెర కొవ్వుగా మారుతుంది. ముఖ్యంగా బొడ్డు చుట్టూ ఇది పేరుకుపోతుంది. దీంతో శరీరం అదనపు కేలరీలు కొవ్వుగా మారి కడుపు చుట్టూ నిల్వ చేస్తుంది. అంతే.. వేగంగా బరువు పెరిగిపోతారు. అధిక చక్కెర మొటిమలు, ఇతర చర్మ సమస్యలను కలిగిస్తుంది. ఇది ఇన్సులిన్ స్థాయిలను పెంచుతుంది. ఇది వాపుకు కూడా దారితీస్తుంది. చక్కెర నోటిలో బ్యాక్టీరియాను ఫీడ్ చేస్తుంది. ఇది మరింత కావిటీస్, దంత క్షయానికి దారితీస్తుంది. ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల మీ రక్తపోటు పెరుగుతుంది. మీ గుండె సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులు రావడం మూడ్ స్వింగ్స్‌కు కారణం అవుతుంది. అంటే మూడీగా, ఆత్రుతగా లేదా చిరాకుగా అనిపిస్తుంది. అలాగే ఎక్కువ చక్కెర తినడం వల్ల స్వీట్లను ఎక్కువగా తినాలని అనిపిస్తుంది. చక్కెర మీ శరీరంలో మంటను కలిగిస్తుంది. ఇది కీళ్ల నొప్పులు, ఇతర తాపజనక సమస్యలకు దారితీస్తుంది. చక్కెర మీ నిద్రకు కూడా భంగం కలిగిస్తుంది. దీంతో నిద్ర పట్టడం కష్టమవుతుంది. మీకు ఈ లక్షణాలలో దేనిన్కెనా అనుభవిస్తే, ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి. అలాగే వెంటనే స్వీట్లు తీసుకోవడం తగ్గించండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. స్వీట్లు తినాలనుకున్నప్పుడు దానికి బదులు ఇతర పదార్థాలు తినడానికి ట్రై చేయాలి.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
BUSINESS బిజినెస్



## త్వరలో ఆర్టీసీలో 7వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

### ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు వెల్లడి

**అమరావతి, నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్ రోడ్డు ట్రాన్స్ పోర్టు కార్పొరేషన్ (ఏపీఎస్ఆర్టీసీ)లో భారీగా ఉద్యోగాల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఏపీఎస్ ఆర్టీసీలో 7 వేల ఉద్యోగాలకు పైగా భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తాజాగా తెలిపారు. ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి నవంబరు 21న బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఉద్యోగాల భర్తీపై సమాచారాన్ని వెల్లడించారు. అలాగే పర్యావరణానికి అనుకూలంగా ఉండేలా విద్యుత్తు బస్సులు కొనుగోలు చేయనున్నామని వెల్లడించారు. అందిన సమచారాం మేరకు ఆర్టీసీలో మొత్తం 7,545 పోస్టులు భర్తీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆర్టీసీలో ఉన్న ఖాళీలపై వివరాలను ప్రభుత్వానికి సమర్పించింది. 18 కేటగిరిల్లో 7,545 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు నివేదికలో వెల్లడించింది. నియామక ప్రక్రియ త్వరలోనే ప్రారంభంకానుంది.కేటగిరీల వారీగా ఖాళీల వివరాలు చూస్తే.. డ్రైవర్ పోస్టులు 3,673, కండక్టర్ పోస్టులు 1,813, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 656, అసిస్టెంట్ మెకానిక్, శ్రామిక్ పోస్టులు 579, ట్రాఫిక్ సూపర్ వైజర్ ట్రైనీ పోస్టులు 207, మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులు 179, డిప్యూటీ సూపరింటెండెంట్ పోస్టులు 280 వరకు ఉన్నాయి. కాగా రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలట్ నియామక రాత పరీక్ష అడ్మిట్‌కార్డులను రైల్వే శాఖ తాజాగా విడుదల చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నంబర్, యూజర్ పాస్‌వర్డ్ లేదా పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి అడ్మిట్‌కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్షలు నవంబర్ 25, 26, 27, 28, 29 తేదీల్లో దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. వివిధ రైల్వే జోన్లలో మొత్తం 18,799 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులను ఈ ప్రకటన ద్వారా భర్తీ చేయనున్నారు. మొత్తం పోస్టుల్లో సికింద్రాబాద్ రైల్వే జోన్‌లో 2,528 వరకు ఉన్నాయి. ఫస్ట్ స్టేజ్ సీబీటీ-1, సెకండ్ స్టేజ్ సీబీటీ-2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా తుది ఎంపిక ఉంటుంది.

## ప్రాణాలు పోయినా భూములివ్వం

### కందుకూరు, కొడంగల్‌లో తిరగబడ్డ రైతులు

**హైదరాబాద్, నవంబర్ 22 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నికంకుశంగా వ్యవహరిస్తున్నది. భూసేకరణ పేరుతో నిర్బంధకాండ కొనసాగిస్తున్నది. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా రైతుల భూములను లాక్కుంటు న్నది. ఫార్మా సిటీ పేరిట లగచర్ల రైతులు తిరగబడిన ఘటన మరువకముందే తాజాగా రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, కొంగరకలాన్‌లో మరోసారి రైతులు తిరగబడ్డారు. ప్రాణం పోయినా ఫ్యూచర్ సిటీకి మా భూములు ఇవ్వమని స్పష్టం చేశారు. భూములు ఇచ్చే ప్రసక్తే లేదంటూ పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. భారీ ఎత్తున పోలీసులను మోహరించి సర్వే పనులు చేపడుతున్నారు.కాగా,30 వేల ఎకరాల్లో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మించనున్నది. హైదరాబాద్ నగర శివార్లలో నిర్మించాలని తలపెట్టిన ఫ్యూచర్ సిటీ కోసం అదనంగా 16 వేల ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిం ది. ఇప్పటికే ప్రభుత్వం దాదాపు 13,973 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. దీనికి అదనంగా 16 వేల ఎకరాలకు పైగా భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని సర్కారు నిర్ణయించింది. అంటే మొత్తం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేయనుంది.ల్యాండ్ పూలింగ్ విధానంలో సేకరించనున్నారు.

## రైతుల భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు వద్దు

### సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, నవంబర్ 22 :** రైతుల పంటలు పండించే భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడాన్ని సీపీఐ వ్యతిరేకిస్తుంది. గిరిజనుల భూములు వారికే ప్రభుత్వం అప్పగించి ఫార్మాసిటీని జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లాకేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మంద పవన్‌తో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. లగచర్ల ఫార్మాసిటీని ఫోర్త్ సిటీగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రూ.2 లక్షల పైన పంట రుణమాఫీ పై కాంగ్రెస్ ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని, వీటిపై ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఏం చేసిందని, మరో నాలుగేండ్లలో ఏమి చేస్తారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గడప మల్లేశ్, దయానంద్, జనార్దన్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.


## మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### బైక్, లారీ ఢీ ఇద్దరు యువకులు మృతి

**మెదక్, నవంబర్ 22 :** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదంచోటు చేసుకుంది. బైక్, లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన పిల్లికొట్యాల్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శంకరంపేట మండలం శాలిపేట గ్రామానికి చెందిన నవీన్(23), వంశీ(25), నవీన్ సోదరి భాగ్య ముగ్గురు కలిసి బైక్ వెళ్తున్నారు. ఈ క్రమంలో పిల్లికొట్యాల్ వద్ద బైక్‌ను లారీ ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. భాగ్యకు తీవ్ర గాయాలవడం తో పరిస్థితి విషమంగా మారింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చి భాగ్యను హాస్పిటల్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివారలు తెలియాల్సి ఉంది.

## ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను దెబ్బతీసిన వైకాపా పాలన

- వ్యవస్థలను నిర్వీర్యం.. అప్పుల కుప్పగా ఆర్థిక రంగం
- ఇప్పుడిప్పుడే గాడిలో పెట్టే ప్రయత్నాలు చేపట్టాం
- 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో ముందుకు
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి, నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను దెబ్బతీసేలా వైకాపాపాలన సాగిందని ఏపీ సీఎం చంద్రబాబు విమర్శించారు. అన్ని వ్యవస్థలను దెబ్బతీసారని, ఆర్థికంగా దోచుకున్నారని మండిపడ్డారు. మళ్లీ ఎపిని గాడిలో పెట్టేందుకు నానా అగచాట్లు పడుతున్నామని శాసనసభ సమావేశాల్లో ఆయన వెల్లడించారు. 'జగన్ చేసిన అవినీతి అంశాన్ని ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. ఆంధప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం. మరొకరు ఇలాంటి తప్పులు చేయకుండా చూస్తాం. అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ కూడా మా దగ్గర ఉంది. దీనిపై అధ్యయనం చేసి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటాం' అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని సీఎం చంద్రబాబుఅన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభ లో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. 'వైకాపా ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు'అని చంద్రబాబు అన్నారు. ఇదిలావుంటే తన అవినీతి ఖ్యాతిని జగన్ విశ్వవిఖ్యాతం చేసుకున్నారని తెదేపా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రూ.60 వేల కోట్లు దోచుకొని జగన్ ఈడీ కేసుల్లో ఉన్నారన్నారు. 12 ఏళ్లుగా కేసును నడుపుకొంటూ వెళ్తున్నారని చెప్పారు. వాటిని ఎలా పొడిగించాలో తెలిసిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. అటువంటి వ్యక్తికి రూ.1,750 కోట్లు లంచం తీసుకోవడం ఓ లెక్కా అని ఎద్దేవా చేశారు. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలతో భారీగా దోచుకునేందుకు ప్రణాళిక చేశారని ఆరోపించారు. 'జగన్ దోపిడీతో రాష్ట్రానికి నష్టం జరిగింది. అదానీతో చాలా ఒప్పందాలు చేసుకున్నారు. ఓ తెలుగు వాడు నిర్వహిస్తున్న గంగవరం పోర్టును అక్రమంగా అదానీకి కట్టబెట్టారు. జగన్ అవినీతిని పరాకాష్ఠకు చేర్చారు. ప్రభుత్వ ఖర్చుతోనే తన నివాసానికి ఇనుప బారికేడ్లు పెట్టుకున్నారు. సీఎంగా పర్యటనకు వస్తే చెట్లు కొట్టేయాలా? పరదాలు పెట్టుకోవాలా? దుకాణాలు మూసేయాలా? ఇలాంటి పిరికి వ్యక్తి సీఎం ఎలా అయ్యారు? అమెరికాలో కేసులు వాయిదా వేయించుకునే అవకాశం లేదు. దేశంలో అయితే కేసులు వాయిదా వేయించుకోవచ్చు. జగన్ చేసిన నేరాలు, అక్రమాలపై విచారణ చేయాలని కోరుతున్నాం' అని బుచ్చయ్య చౌదరి అన్నారు.

## డిసెంబర్ నుంచి అమరావతి పనులు వేగవంతం



- మూడేళ్లలో అమరావతికి కచ్చితమైన రూపురేఖలు ఇస్తాం
- మూడేళ్లలో 50వేల కోట్ల ఖర్చుకు సిద్ధం
- పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం
- పోలవరం కూడా 2027నాటికే పూర్తి
- విజన్ 2047 లక్ష్యాలను వివరించిన సీఎం చంద్రబాబు
- ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా

**అమరావతి, నవంబర్ 22 :** ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. అయితే, బడ్జెట్‌పై చర్చలో భాగంగా.. అసెంబ్లీ సమావేశాల ఆఖరి రోజు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు.. అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం చేసిన చంద్రబాబు.. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర -2047 డాక్యుమెంట్‌ను వివరించారు. ఇందులో విజన్ 2027 కూడా ప్రకటించారు. అంటే 2027 నాటికి అమరావతి ఎలా ఉండబోతోంది. పోలవరం నిర్మాణం పరిస్థితి ఏంటనే దానిపై క్లియర్ కట్ ప్రజెంటేషన్ ఇచ్చారు సీఎం చంద్రబాబు.. అంతేకాకుండా.. డిసెంబర్ నుంచి అమరావతి పనులు పరుగులు పెట్టనున్నాయని.. మూడేళ్లలో అమరావతికి కచ్చితమైన రూపురేఖలు ఇస్తామన్నారు. 6, 9, 12, 30నెలల చొప్పున భవనాల నిర్మాణాలకు డెడ్‌లైన్స్‌తోపాటు.. మూడేళ్లలో 50వేల కోట్ల ఖర్చుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. పోలవరం కూడా 2027నాటికే పూర్తి, జాతికి అంకితం చేస్తామని.. సభలో విజన్ 2047తోపాటే 2027లక్ష్యాలను సీఎం చంద్రబాబు వివరించారు..ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. వచ్చే ఎన్నికల గురించి, సీఎం ఎవరు ఉంటారన్నదానిపై కూడా క్లారిటీ చ్చారు.. ఐదోసారి కూడా ముఖ్యమంత్రిగా వస్తానంటూ చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అంటే.. వచ్చే సారి కూడా తానే ముఖ్యమంత్రి అంటూ చెప్పకనే చెప్పారు.. సీఎం చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు 4.0 వెర్షన్ ఇప్పుడే మొదలైందన్న చంద్రబాబు.. ఐదోసారి కూడా తానే ముఖ్యమంత్రిగా వస్తానంటూ ధీమా వ్యక్తంచేశారు. మంచి చేసే వారిని ప్రజలు మళ్లీ మళ్లీ గెలిపిస్తారన్న చంద్రబాబు.. కొన్ని రాష్ట్రాలలో ఒకే పార్టీ 30 ఏళ్లు పాలించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని.. టీమ్ లీడర్‌గా తాను పనిచేస్తానని.. మిగతా సభ్యులు కూడా ఇందుకోసం కృషి చేయాలంటూ సీఎం చంద్రబాబు సూచించారు. ఎమ్మెల్యేలంతా.. తమ తమ నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని సూచించారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. పదిరోజుల పాటు జరిగిన సమావేశాలు శుక్రవారంతో ముగిసాయి. దాదాపు 60 గంటలపాటు సమావేశాలు జరిగాయని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలిపారు. ఈ సమావేశాల్లో 21 బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో 120 మంది సభ్యులు ప్రసంగించారని వివరించారు.

## చెత్తపన్ను రద్దుకు అసెంబ్లీ ఆమోదం

### సర్వత్రా హర్ష్ వ్యక్తం చేస్తున్న జనం

**అమరావతి, నవంబర్ 22 :** పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్ను రద్దుకు శాసనసభ ఆమోదం తెలిపింది. మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ బిల్లు ప్రవేశపెట్టగా స్వల్ప చర్చతో సభ ఆమోదించింది. దీంతో సర్వత్రా హర్ష్ వ్యక్తం అవుతోంది. గతంలో వైఎస్ జగన్ హయాంలో చెత్తపన్ను వేయగా, రాష్ట్రంలో నిరసనలు పెల్లుబికాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చెత్తపన్ను వసూలు, కాంట్రాక్టుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి హయాంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని అన్నారు. ఇంటి పన్ను రూ.50 వున్న పేద వారి నుంచి చెత్తపన్ను ఏడాదికి రూ.360 వసూలు చేశారని ఎద్దేవా చేశారు. చెత్త తొలగింపు కాంట్రాక్టర్లకు సొమ్ము చెల్లించేందుకు వీలుగా ఈ పన్ను వసూలు చేశామని గత పాలకులు చెప్పారన్నారు. 2014-19 మధ్య టిడిపి అధికారంలో ఉన్న సమయంలో మున్సిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదని తెలిపారు. కానీ వైసిపి చెత్తపన్నుతోపాటు ఆస్తి పన్ను పెంచిందన్నారు.

## మహారాష్ట్రలో గెలిచేది కాంగ్రెస్ పార్టీనే

- ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తప్పవుతాయి
- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

**కర్ణాటక, నవంబర్ 22 :** మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమిలే విజయం సాధిస్తాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ కూటమిలే విజయం సాధిస్తాయంటూ ఎగ్జిట్ పోల్స్ వేసిన అంచనాలు తప్పవుతాయని డీకే చెప్పారు.ఉత్తర కన్నడ జిల్లాలోని మురుడేశ్వర దేవాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన శివకుమార్.. 'తప్పకుండా మేమే గెలుస్తాం. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారవుతాయి' అని అన్నారు. తాను మహారాష్ట్రలో ప్రచారం నిర్వహించానని, అక్కడి జనాధరణను చూస్తే తప్పకుండా గెలుస్తామనే నమ్మకం కలిగిందని డీకే చెప్పారు.ఇదిలావుంటే మహారాష్ట్రలో స్వల్ప తేడాతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమే విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. తాను మహారాష్ట్రకు వెళ్లానని, పలువురు నేతలతో మాట్లాడానని, పరిస్థితి ప్రతిపక్ష కూటమికే అనుకూలంగా ఉందని చెప్పారు.

www.varadhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక
SPORTS
క్రీడలు



# భారత పేసర్ల దాటికి ఆస్ట్రేలియా
# టాపార్డర్ విలవిల

- రాణించిన నితీశ్‌రెడ్డి
- తొలి ఇన్నింగ్స్‌లో 83 పరుగుల ఆధిక్యంలో భారత్

టీమిండియా కెప్టెన్, ఏస్ బౌలర్ బుమ్రా రెచ్చిపోవడంతో ఆస్ట్రేలియా బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. స్వదేశంలో ఆడుతున్నప్పటికీ క్రీజ్ లో ఉండడానికే తిప్పలు పడ్డారు. అలెక్స్ క్యారీ (19) చేసిన పరుగులే టాప్ స్కోర్ అంటే.. ఆ జట్టు బ్యాటింగ్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. బుమ్రా ప్రారంభించి నిప్పులు జరిగే విధంగా బంతులు వేయడంతో ఆస్ట్రేలియా బ్యాటర్లు ఏ దశలోనూ కోలుకోలేదు. ఉస్మాన్ ఖవాజా (8), మెక్ స్వీని(10), స్టీవెన్ స్మిత్ (0), పాట్ కమిన్స్(3) వంటి ఆటగాళ్లు బుమ్రా దెబ్బకు పెవిలియన్ చేరుకున్నారు. మరో బౌలర్ మహమ్మద్ సిరాజ్ కూడా నిప్పులు చెరిగాడు. లబూసాగ్నే(2), మిచెల్ మార్ష్(6) వంటి ఆటగాళ్లను అవుట్ చేసి.. సత్తా చాటాడు. కొంతకాలంగా సరైన విధంగా బౌలింగ్ చేయలేకపోతున్న సిరాజ్.. ఈ మ్యాచ్లో మాత్రం అదరగొట్టాడు. యువ బౌలర్ హర్షిత్ రాణా తన ఆరంగేట్ర మ్యాచ్ లోనే అదరగొట్టాడు. ప్రమాదకరమైన ఆటగాడు హెడ్ (11) ను క్లీన్ బౌల్డ్ చేసి సంచలనం సృష్టించాడు. హెడ్ అవుట్ కావడంతో భారత జట్టులో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇక తొలి రోజు ఆట నేపథ్యంలో భారత్ ఆస్ట్రేలియా పై 83 పరుగుల లీడ్ లో ఉంది. ఇక అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా ఆస్ట్రేలియా బౌలర్ల ముందు తలవంచింది. నితీష్ కుమార్ రెడ్డి (41), రిషబ్ పంత్ (37), కేఎల్ రాహుల్ (26) సత్తా చాటడంతో ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న యశస్వి జైస్వాల్ (0), విరాట్ కోహ్లీ (5), దేవదత్ పడిక్కల్(0) పూర్తిగా నిరాశపరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో హేజిల్ వుడ్ నాలుగు వికెట్లు సొంతం చేసుకున్నాడు.. స్టార్క్, కమిన్స్, మార్ష్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.



మైదానంపై తేమ ఉండడంతో.. దానిని ఆస్ట్రేలియా బౌలర్లు సద్వినియోగం చేసుకున్నారు. అద్భుతమైన బంతులు సంధిస్తూ భారత ఆటగాళ్లను విపరీతంగా ఇబ్బంది పెట్టారు. ఒకానొక సందర్భంలో భారత్ 100 పరుగులైనా చేయగలుగుతుందా? అనే సందేహం ఉన్న నేపథ్యంలో.. తెలుగు ఆటగాడు నితీష్ కుమార్ రెడ్డి సత్తా చాటాడు. హాఫ్ సెంచరీ చేయలేకపోయినప్పటికీ.. ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. అతడి ఎదురుదాడి వల్లే భారత్ 150 పరుగులైనా చేయగలిగింది. లేకుంటే 100 పరుగుల లోపే కుప్పకూలేది. అతడు ఆడిన ఇన్నింగ్సే భారత జట్టుకు ప్రధాన బలంగా మారింది. లేకపోతే పరిస్థితి మరింత అద్వానంగా ఉండేది. అదే జరిగితే టీమిండియా ఇబ్బంది పడాల్సి ఉండేది. కాగా రిషబ్ పంత్ రోడ్డు ప్రమాదం నుంచి కోలుకొని వచ్చిన తర్వాత సరికొత్త క్రికెట్ ఆడుతున్నాడు. అద్భుతమైన ఇన్నింగ్స్ ను నిర్మిస్తున్నాడు. వాటిని మూడంకెల స్కోర్ లు గా మలచలేకపోతున్నప్పటికీ.. ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో సింహ స్వప్నం లాగా మిగిలిపోతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్ సిరీస్ లో.. ముంబై వేదికగా జరిగిన మూడవ టెస్ట్ మ్యాచ్ రెండవ ఇన్నింగ్స్ లో.. భారత జట్టును విజయ తీరం వద్దకు రిషబ్ పంత్ చేర్చాడు. తోటి ఆటగాళ్లు విఫలమవుతున్నప్పటికీ ఒంటి చేత్తో పోరాటం చేశాడు. ఆ పోరాటం భారత ఆటగాళ్లకే కాదు, న్యూజిలాండ్ ఆటగాళ్లకు కూడా నచ్చింది. అందువల్లే అతడు ఆడుతున్నప్పుడు అభినందించారు. ఫోర్లు కొడితే చప్పట్లు కొట్టారు. సిక్స్ లు కొడితే భుజం తట్టి కీర్తించారు.. అయితే అలాంటి ఆటనే పంత్ మరోసారి నిరూపించాడు. ఆస్ట్రేలియా వేదికగా ప్రదర్శించాడు. పంత్ బ్యాటింగ్ స్టైల్ చూసి ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ సైతం ఆశ్చర్యపోయాడు. ఏం బ్యాటింగ్ అంటూ కితాబిచ్చాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ లో భారత జట్టు ముందుగా బ్యాటింగ్ చేసింది. వెంట వెంటనే వికెట్లను కోల్పోయింది. దీంతో రిషబ్ పంత్ మరొకసారి ఆపద్బాంధవుడి పాత్ర పోషించాల్సి వచ్చింది. ఈ క్రమంలో అతడు 78 బంతులు ఎదుర్కొని 37 పరుగులు చేశాడు. ఇందులో మూడు ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి.. ముఖ్యంగా ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ బౌలింగ్ లో పంత్ కొట్టిన సిక్సర్ టీమిండియా ఇన్నింగ్స్ కే హైలెట్ గా నిలిచింది. 42 ఓవర్లో కమిన్స్ తన చివరి బంతిని అవుట్ సైడ్ హాఫ్ స్టంప్ దిశగా వేశాడు. అయితే ఆ బంతి తనకు ఎడమవైపు రావడంతో.. వెనక్కి జరిగి డీప్ బ్యాక్ వర్డ్ స్క్వేర్ మీదుగా స్కూప్ షాట్ కొట్టాడు. అయితే ఆ బంతి అమాంతం గాల్లో లేచి బౌండరీ లైన్ దాటింది. సమయంలో తల బ్యాలెన్స్ ఆపుకోలేక పంత్ ముందుగా మోకాలి పై పడిపోయాడు. ఆ తర్వాత అమాంతం శరీరం మొత్తాన్ని కిందకి వాల్చాడు. అతడు కొట్టిన దెబ్బకు బంతి స్టాండ్స్ లో పడింది. దీంతో స్టేడియం మొత్తం నవ్వులు విరిసాయి. కామెంటేటర్లు సైతం ఆశ్చర్యపోయారు. ” అద్భుతాన్ని మరోసారి ఆవిష్కరించాడు. ఇలా విచిత్రమైన గేమ్ ఆడటం పంత్ కు మాత్రమే సొంతం. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు అతడు దూకుడుగా ఆడతాడు. అందువల్లే అతడు అందరికీ నచ్చుతాడని” పంత్ ను కొనియాడారు. పంత్ కొట్టిన షాట్ చూసి ఆస్ట్రేలియా కెప్టెన్ కమిన్స్ సైతం ఆశ్చర్యపోయాడు.



## తన విలువ రూ.8.5 కోట్లుగా
## ప్రకటించిన అశ్విన్

భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్. ఐపీఎల్ మిడ్ వేలానికి రెండు రోజుల ముందు ఆయన స్వయంగా నిర్వహించిన మాక్ వేలంలో తనను సీఎస్‌కేకు విక్రయించుకున్నాడు. తన విలువను రూ.8.5 కోట్లుగా ప్రకటించాడు. దక్షిణాఫ్రికా ఆటగాడు మార్క్‌రమ్‌ను కేవలం రూ.2.5 కోట్లకు చౌకగా దక్కించుకున్నాడు. ఆశ్చర్యకరమైన సంఘటనలలో స్పిన్నర్ ఆర్ అశ్విన్ నిర్వహించిన ఐపీఎల్ మాక్ వేలం తనను తాను 8.5 కోట్ల రూపాయలకు సీఎస్‌కేకు విక్రయించింది. ఐదుసార్లు ఛాంపియన్‌లతో తన ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించిన తమిళనాడు స్పిన్నర్, 2025 వేలానికి ముందు ఆర్ఆర్ అశ్విన్‌ను వదులుకుంది. దీంతో అశ్విన్ కొత్త జట్టు వెతుకుంటున్నాడు. ఈ క్రమంలో మాక్క వేలంలో సీఎస్‌కేకు విక్రయించబడిన ఆటగాళ్లలో, ఐడెన్ మార్క్రామ్ రూ. 2.5 కోట్లకు, టి.నటరాజన్ రూ. 10 కోట్లకు విక్రయించబడిన కొన్ని ఆశ్చర్యకరమైన ఎంపికలు ఉన్నాయి.ఐపీఎల్ 2025 వేలంలో రూ. 2 కోట్ల బేస్ ప్రైస్‌కు రిజిస్టర్ చేసుకున్న రవిచంద్రన్ అశ్విన్, స్పిన్నర్ స్వయంగా నిర్వహించిన ఐపీఎల్ మాక్ వేలంలో రూ. 8.5 కోట్లకు సీఎస్‌కే చేత ఎంపికయ్యాడు. మరింత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దక్షిణాఫ్రికాకు చెందిన ఐడెన్ మార్క్రామ్ వేలంలో అతను నమోదు చేసుకున్న ధర కంటే కేవలం రూ. 2.5 కోట్లకు 50 లక్షలు ఎక్కువ. రవీంద్ర జడేజా మరియు రుతురాజ్ గైక్వాడ్‌లతో సహా సీఎస్‌కే రిటైల్ ఆటగాళ్లు ఒక్కొక్కరు రూ. 18 కోట్లకు రిటైన్ చేయబడ్డారు, మాక్ వేలంలో సీఎస్‌కే రూ. 10 కోట్లకు టి.నటరాజన్ సేవలను కొనుగోలు చేసింది. పేసర్ గతంలో ఆర్ఆర్‌లో భాగంగా ఉండేవాడు.కానీ 2025లో కొత్త సీజన్‌కు ముందు విడుదల చేయబడ్డాడు. మాక్ వేలంలో సీఎస్‌కే బ్యాటర్ రాహుల్ త్రిపాఠిని రూ.8.5 కోట్లకు, మాజీ ఆటగాడు సామ్ కుర్రాన్ రూ.7.5 కోట్లకు, స్పిన్నర్ రాహుల్ చాహర్ రూ. 6.5 కోట్లకు ప్రధాన ఆటగాళ్లను చేర్చుకున్నారు. రైట్ టు మ్యాచ్ కార్డ్‌ను ఓపెనర్ డెవాన్ కాన్వే కోసం ఐదుసార్లు ఛాంపియన్‌గా ఉపయోగించారు, అతని సేవలను రూ. 5 కోట్లకు మాత్రమే పొందారు. అశ్విన్ నిర్వహించిన మాక్ వేలంలో సీఎస్‌కే అంతర్జాతీయ స్టార్లలో రొమారియో షెపర్డ్, విలియం ఓ'రూర్క్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌లతో సహా బలమైన బ్యాకప్‌లను పొందింది. భారతీయ ఆటగాళ్ల జాబితాలో యష్ ఠాకూర్, మాజీ సీఎస్‌కే స్టార్ రాజ్వర్ధన్ హంగ్రేకర్, అథర్వ తైదే, సుయాష్ ప్రభుదేశాయ్ ఉన్నారు, వీరంతా రూ. 2 కోట్ల కంటే తక్కువ ధరతో కొనుగోలు చేశారు.

## థర్డ్ ఎంపైర్ తప్పిదానికి కేఎల్ రాహుల్ బలయ్యాడా?

మొత్తంగా తొలిరోజు భారత్ ఆస్ట్రేలియాపై పై చేయి సాధించింది. ఇప్పటివరకు 83 పరుగుల లీడ్ లో నిలిచింది. బుమ్రా నాలుగు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్ రెండు వికెట్లు సొంతం చేసుకున్నాడు.. హర్షిత్ రాణా ఒక వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ భారీ స్కోర్ చేయలేకపోయింది. భారత జట్టులో నితీష్ కుమార్ రెడ్డి (41), రిషబ్ పంత్ (37), కేఎల్ రాహుల్ (26) మాత్రమే రాణించారు. మిగతా ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్ 0 పరుగులకే అవుట్ అయ్యారు. విరాట్ కోహ్లీ అయిదు పరుగులకే పె విలియన్ చేరుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో హేజిల్ వుడ్ 4 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. మార్ష్, స్టార్క్, కమిన్స్ తలా రెండు వికెట్లు నేలకూల్చారు. అయితే టీమిండియా ఇన్నింగ్స్ సమయంలో కేఎల్ రాహుల్ అవుట్ అయిన తీరు నెట్టింట చర్చకు దారితీస్తోంది. అయితే అతడు అంపైర్ల చేతిలో బలయ్యాడని కొంతమంది అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. మిచెల్ స్టార్క్ బౌలింగ్లో రాహుల్ డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించాడు. అయితే ఆ బంతి బ్యాట్ ను తగిలి వెళ్లిందని.. ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఎంపైర్ కు అప్పీల్ చేశారు. అయితే ఫీల్డ్ ఎంపైర్ అవుట్ అని ప్రకటించలేదు.. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టు రివ్యూ కి వెళ్ళింది. థర్డ్ అంపైర్ స్నికో మీటర్ ను పరిశీలించాడు. అయితే ఆ బంతి బ్యాట్ సమీపం నుంచి వెళ్తున్న సమయంలో రాహుల్ ప్యాడ్ లకు బ్యాట్ తగిలింది. ఈ క్రమంలో స్నికో మీటర్ లో స్పైక్ కనిపించింది. బ్యాట్ కు బంతి తగిలినందు వల్ల అలా వచ్చిందా? బ్యాట్ ప్యాడ్ లకు తగిలినందువల్ల స్నికో అలా చూపించిందా? అనే విషయం ప్రేక్షకులను గందరగోళానికి గురిచేసింది. అయితే థర్డ్ అంపైర్ ఫ్రంట్ వ్యూ విధానంలో పరిశీలించారు. బంతి వస్తున్న దిశ లో డిఫ్లెక్షన్ చోటుచేసుకుందని.. అందువల్లే అవుట్ ఇచ్చాను అని ప్రకటించారు.. అయితే థర్డ్ అంపైర్ అలా అవుట్ ఇవ్వడంతో రాహుల్ ఆవేదనతో మైదానాన్ని వీడాడు. థర్డ్ అంపైర్ నిర్ణయం పట్ల అసంతృప్తి



వ్యక్తం చేశాడు. రోహిత్ శర్మ తొలి టెస్ట్ కి దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో కేఎల్ రాహుల్ ఓపెనర్ గా వచ్చాడు. 74 బంతుల్లో అతడు 26 పరుగులు చేశాడు. థర్డ్ అంపైర్ కె.ఎల్ రాహుల్ ను అవుట్ ప్రకటించడంతో సీనియర్ ఆటగాళ్లు మండిపడుతున్నారు. థర్డ్ అంపైర్ నిర్లక్ష్యం వల్ల కేఎల్ రాహుల్ బలయాడని పేర్కొంటున్నారు. సంజయ్ అవుట్ అని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు. థర్డ్ అంపైర్ చేతిలో రాహుల్ బలయ్యాడని.. అతడు దురదృష్టవంతుడిగా మారిపోయాడని వసీం వక్రం పేర్కొన్నాడు. ఇది అత్యంత హాస్యాస్పదమైన నిర్ణయం అని రాబిన్ ఊతప్ప అది అఖ్యానించాడు.. ఇది చెత్త నిర్ణయమని.. రాహుల్ అవుట్ అని చెప్పడానికి బలమైన కారణం లేదని.. అల్ట్రా ఎడ్జ్ లో థర్డ్ అంపైర్ చూస్తున్నప్పుడు టూ స్పెక్స్ కనిపించలేదా అని ఆకాష్ చోప్రా మండిపడ్డాడు.

## పాక్‌కు టీమిండియా వెళ్లడంపై
## ప్రభుత్వానిదే తుది నిర్ణయం

### భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్

పాకిస్తాన్, ఇండియా మధ్య క్రికెట్ సంబంధాలపై నిషేధాజ్ఞలు ఉన్నాయి అన్న విషయం తెలిసిందే. కొన్ని దశాబ్ద కాలానికి పైగానే ఈ నిషేధం కొనసాగుతూ ఉంది. అయితే ఈ బ్యాన్ కారణంగా భారత జట్టు పాకిస్తాన్ పర్యటనకు వెళ్లదు. పాకిస్తాన్ జట్టు భారత పర్యటనకు రాదు. ఇలా ఇరు జట్లు కూడా మ్యాచ్ ఆడాలంటే కేవలం ఐసీసీ టోర్నీలో మాత్రమే సాధ్యమవుతూ ఉంటుంది. అయితే గత కొంతకాలం నుంచి పెద్ద టోర్నమెంట్లు పాకిస్తాన్ వేదికగా జరుగుతున్నాయ్. గతంలో ఆసియా కప్ కూడా పాకిస్తాన్ లో జరగగా టీమిండియా.. అటు పాకిస్తాన్ వెళ్లేందుకు నిరాకరించింది. దీంతో భారత జట్టు కోసం పాకిస్థాన్ లో జరగాల్సిన మ్యాచ్లను హైబ్రిడ్ పద్ధతిలో మరోచోట నిర్వహించడంతో భారత్ ఆసియా కప్ లో పాల్గొని మ్యాచ్లు ఆడింది. అయితే వచ్చే ఏడాది పాకిస్తాన్ అటు ఐసిసి టోర్నీ అయినా ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యం ఇవ్వబోతుంది. కాగా ఛాంపియన్స్ ట్రోఫీ కోసం అటు భారత్, పాకిస్తాన్ వెళ్లడంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. తాము ఎట్టి పరిస్థితుల్లో పాకిస్తాన్ కు వెళ్లే అవకాశం లేదు అంటూ ఇప్పటికే టీమ్ ఇండియా తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే హైబ్రిడ్



పద్ధతిలో తాము ఆడే మ్యాచ్లను నిర్వహించాలి అంటూ స్పష్టం చేసింది. ఇక ఈ విషయంపై తీవ్రస్థాయిలోనే చర్చ జరుగుతూ ఉంది అన్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో భాగంగా భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కి కూడా ఇలాంటి ప్రశ్న ఎదురయింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టును పాకిస్తాన్ కు పంపవద్దని కేంద్రం దీనిపై మీ అభిప్రాయం ఏంటి అంటూ కపిల్ దేవ్ ను మీడియా ప్రశ్నించింది. ఇక దీనిపై ఆయన ఆసక్తికర సమాధానం చెప్పాడు. నన్ను ఈ ప్రశ్న అడగడం కరెక్ట్ కాదు. దీనిపై మనలాంటి వాళ్ళు అభిప్రాయం కూడా చెప్పవద్దు. పూర్తిస్థాయి నిర్ణయం తీసుకునే బాధ్యత ప్రభుత్వానిదే. ఫైనల్ గా ప్రభుత్వం ఏది డిసైడ్ చేస్తే.. ఇక అదే చివరి నిర్ణయం అవుతుంది అంటూ కపిల్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



# రష్మికతో ప్రేమలో పడ్డ విజయ్

## అసలు విషయం చెప్పకనే చెప్పేసిన రౌడీబాయ్

రౌడీ బాయ్ 'విజయ్ దేవరకొండ' ఎట్టకేలకు రష్మికతో తన బంధాన్ని బయట పెట్టాడు. ఇటీవల రిలీజైన 'సాహిబా' సాంగ్ ప్రమోషన్స్ లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ కంపోజర్ జస్లీన్ రాయల్ తో పాటు హీరోయిన్ రాధికా మదన్ పాల్గొని విజయ్ లవ్ లైఫ్ సీక్రెట్స్ ని బయటపెట్టారు. దీంతో ఎట్టకేలకు రష్మిక, విజయ్ సంబంధం ఏంటో తెలిసిపోయింది అంటున్నారు ఫ్యాన్స్. ఇంతకీ విజయ్ ఏమన్నారంటే.. సెన్సేషనల్ మ్యూజిక్ కంపోజర్ జస్లీన్ రాయల్ 'హీరియే హీరియే' సాంగ్ సక్సెస్ తర్వాత విజయ్ దేవరకొండ, రాధికా మదన్ కాంబినేషన్ లో 'సాహిబా' సాంగ్ రూపొందిచిన విషయం తెలిసిందే. ఈ సాంగ్ మంచి వ్యూస్ సంపాందించుకొని యూట్యూబ్ లో దూసుకుపోతున్న నేపథ్యంలో టీమ్ చిట్ చాట్ నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే టీమ్ విజయ్‌ని లవ్ రిలేషన్షిప్ గురించి అడిగారు. విజయ్ ఆ ప్రశ్నలకి ఆసక్తికరమైన సమాధానాలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ.. 'నేను నా కో స్టార్ ఒకరితో డేటింగ్‌లో ఉన్నాను. నా వయసు 35, నేను ఒంటరిగా ఉంటానని మీరు ఎలా భావించారు. రొమాంటిక్ రిలేషన్షిప్ లోకి వెళ్లేముందే నేను ఆ వ్యక్తులతో క్లోజ్ గా ఫ్రెండ్షిప్ చేస్తాను. నేను ప్రత్యేకించి డేట్‌లకు వెళ్ళాను, ఎవరితోనైతే చాలా కాలం నుండి ఫ్రెండ్షిప్ ఉంటాదో వాళ్ళతోనే బయటకెళ్తాను. నాకు షరతులు లేని ప్రేమ కావాలి. నాకు ప్రేమించడం తెలుసు, ప్రేమను తీసుకోవడం తెలుసు' అన్నారు. అయితే ఇప్పటికే రష్మికకి, విజయ్ కి మధ్యలో మంచి స్నేహం ఉంది. దీపావళి కూడా కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. దీంతో విజయ్, రష్మికతో రిలేషన్షిప్ లో ఉన్నట్లు ఫిక్స్ చేసేస్తున్నారు నెటిజన్లు.

# మరో డిఫరెంట్ కథతో విశ్వక్‌సేన్ మెకానిక్ రాకీతో మెప్పించే యత్నం




మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ కెరీర్ బిగినింగ్ నుంచి కాస్త విభిన్నమైన కథలే ఎంచుకుంటున్నాడు. జయాపజయాలతో పని లేకుండా తనవంతుగా ఏదో ఒక కొత్త ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. జనాల నోటిలో తన సినిమా ఉండేలా ప్రమోషన్స్ కూడా ప్లాన్ చేసుకుంటాడు. ఇటీవల ఆయన నుంచి వచ్చిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' నిరుత్సాహపరిచింది. ఈసారి ఎలాగైనా హిట్టు కొట్టాలనే తపనతో చేసిన చిత్రం 'మెకానిక్ రాకీ'. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం కూడా కొంత డిఫరెంట్‌గా ఉందని టాక్. రాకీ అంతంత మాత్రంగా చదివే ఓ కుర్రాడు. తండ్రి రామకృష్ణ(నరేష్)కు ఓ మెకానిక్ గ్యారేజీ కమ్ డ్రైవింగ్ స్కూల్ ఉంటుంది. చదువు మీద శ్రద్ధలేకపోవడంతో రాకీ కూడా తండ్రి నడిపే షెడ్ పని చేయాల్సి వస్తుంది. తను నడిపే డ్రైవింగ్ స్కూల్‌కి రాకీ స్నేహితుడు శేఖర్ చెల్లి ప్రియా (మీనాక్షి చౌదరి) మాయ (శ్రద్దా శ్రీనాథ్) డ్రైవింగ్ నేర్చుకోవడానికి వస్తారు. రాకీ షెడ్డు ఉన్న స్థలంపై రంకి రెడ్డి (సునీల్) కన్ను పడుతుంది. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆ స్థలం కాజేయాలనుకొంటా డు. దాన్ని అడ్డుకోవాలంటే రాకీకి రూ.50 లక్షలు కావాలి. మరి ఆ రూ.50లక్షలు ఎలా సంపాదించా డు? రాకీ స్నేహితుడు శేఖర్ ఎందుకు చనిపోయాడు? ఇన్సూరెన్స్ పేరుతో జరిగిన స్కామ్‌లో మాయ (శ్రద్దా శ్రీనాథ్) పాత్ర ఏంటి? అన్నది తెరపైనే చూడాలి. ఇక ఆత్మహత్యతో సినిమా ప్రారంభమవుతుంది. చనిపోయిం ది ఎవరు.. ఏంటి అనేది చెప్పకుండా కాసేపు అంతా సీరియస్‌గా నడుస్తోంది. ఆ తదుపరి హీరో రాకీ కథలోకి ఫన్నీగా తీసుకెళ్లాడు దర్శకుడు. మొదటిభాగం అంతా రాకీ కాలేజ్, ప్రియాతో ప్రేమ, తండ్రితో తిట్లు.. గ్యారేజ్ గొడవ, దానిని కాపాడుకోవడానికి పడే పాట్లతో ఫస్టాఫ్ ముగుస్తుంది. అంతకు మించి ప్రథమార్ధంలో ఆసక్తికర అంశాలు లేదు. హీరోయిన్ మీనాక్షి చౌదరిని పిసినారిగా చూపించడం కాస్త ఫన్ క్రియేట్ చేసింది. దొంగ బ్యాగ్ కొట్టేసే సీన్ నవ్వులు పూయిస్తుంది. సెకండాఫ్ ప్రారంభంలో అసలు కథ మొదలవుతుంది. ఫస్టాఫ్ అంతా ఫన్ రైడ్‌తో లవ్‌స్టోరీలాగా నడిచిన కథ ఒక్కసారి టర్న్ అవుతుంది. లవ్ జానర్ అనుకున్న కథ క్రైమ్ జానర్‌లో సాగే థ్రిల్లర్‌గా మారిపోతుంది. మొదటి ట్విస్ట్‌తో కథ ఏంటి అనేది అర్థమవుతుంది. సెకండ్ ట్విస్ట్ ప్రేక్షకుడి ఊహకు అందనిదే. ఆ విషయంలో పాత్రల్ని ట్విస్ట్‌లకు అనువుగా వాడుకోవడం బాగుంది. ఫస్టాఫ్ సాగదీతగా సాగడంతో ద్వితీయార్థమే సినిమాకు బలంగా నిలిచింది. మధ్య తరగతి ఆశ, అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు చేసే మోసాలను ఇందులో చూపించారు. ఇన్సూరెన్స్ పేరుతో జరుగుతున్న సైబర్ క్రైం, ఆ మోసగాళ్ల ప్లాన్స్ ఎలా ఉంటాయనేది.. దానిలో ఎత్తులు, పైఎత్తులను బాగా డీల్ చేశారు. కొన్ని సన్నివేశాల్లో ఇలా కూడా జరుగుతుందా అనిపిస్తుంది. అయితే అక్కడక్కడ సహజత్వం లోపించింది. నటీనటుల పనితీరుకొస్తే.. విశ్వక్ ఎనర్జీ ఎనర్జీని దర్శకుడు బాగా వాడుకున్నాడు. సినిమా మొత్తం అతని చుట్టూ తిరుగుతుంది. తనదైన మాస్ స్టైల్‌ని చూపించాడు. మాస్ డైలాగులు తనదైన స్టైల్‌లో చెప్పి మెప్పించాడు. మీనాక్షి చౌదరి పద్ధతి గల పాత్రలో మెప్పించింది. ఆ పాత్రలతో పాటు శ్రద్దా శ్రీనాథ్ చేసిన పాత్ర కూడా సినిమాకు కీలకం. గ్లామర్‌కు పరిమతం కాకుండా ఇద్దరి పాత్రలకు పాధాన్యం కల్పించారు. నరేష్ తన పాత్ర మేరకు నటించారు. వైవా హర్ష కొన్ని చోట్ల నవ్వించాడు. హర్షవర్ధన్ పాత్ర ఫర్వాలేదు. సునీల్‌ని మొదట్లో పెద్ద డాన్‌లా చూపించి పిల్లిని చేసేశారు. ఇక దర్శకుడు రవితేజకు ఇది తొలి సినిమా. రాసుకున్న కథ, తను చెప్పాలనుకున్నది కరెక్ట్‌గానే ఉన్నా.. అక్కడక్కడా తడబాటు కనిపించింది. తను పూర్తి సెకెండాఫ్ ట్విస్ట్‌ల మీదే ఆధారపడినట్లు అనిపించింది. ఫస్టాఫ్‌కు ఇంకాస్త వర్క్‌వుట్ చేసి ఎమోషన్స్ జోడించి ఉంటే బావుండేది. సెకండాఫ్‌ని డీల్ చేసిన పద్ధతి బాగుంది. పూర్తిగా ట్విస్టుల్ని నమ్ముకొన్న కథ కావడంతో ఆ ట్విస్ట్‌ల కోసం ఫస్టాఫ్ ఓపికగా చూడాలి.

# గేమ్ చేంజర్ నుంచి మెలోడి సాంగ్

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా సినిమా 'గేమ్ ఛేంజర్' . కియారా అద్వానీ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 10న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇటీవల రిలీజైన టీజర్ సూపర్ రెస్పాన్స్ సాధించగా, విడుదలైన రెండు పాటలు చాట్ బస్టర్ లుగా నిలిచాయి. ఈ తరుణంలోనే మరో మెస్మరైజింగ్ సర్ప్రైజ్ ఇచ్చేందుకు మూవీ టీమ్ రెడీ అవుతుంది. అందరు భావిస్తునట్లే మూవీ టీమ్ సినిమా నుండి థర్డ్ సింగిల్ ని రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతోంది. దీనిపై మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఆసక్తికర ట్వీట్ షేర్ చేశారు. ఈ సాంగ్ ని నవంబర్ 22న అనౌన్స్ చేయనుండగా, ప్రోమోని 25న, సాంగ్ ని 27న రిలీజ్ చేయనున్నారట. ఇక ఇదొక మెలోడీ సాంగ్ అని తమన్ కన్ఫామ్ చేశారు. రామ్ చరణ్ మూవీ నుండి ఒక మెలోడీ వచ్చి చాలా రోజులైంది. దీంతో శంకర్ డైరెక్షన్, తమన్ మ్యూజిక్, రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ ఈ కాంబినేషన్‌లో మెలోడీ అంటే మెగా ఫ్యాన్స్ చెవులు కోసుకుంటున్నారు. ఇక లిరిసిస్ట్ రామజోగయ్య శాస్త్రి ట్వీట్ చేస్తూ.. 'విని చాలా రోజులైంది. కానీ ఇంకా నా మనసులో మారు మ్రోగుతూనే ఉంది. విన్న వెంటనే నచ్చేసే మోలోడీ' అంటూ పోస్ట్ చేశారు. అలాగే తమన్ నుండి రాబోతున్న నెక్ట్స్ లెవల్ సాంగ్ గా చెప్పుకొచ్చారు. దీంతో చరణ్ అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.




# పుష్ప-2 విడుదలతో పూనకం

విశాఖలో భారీ కటౌట్ ఏర్పాటులో అభిమానులు

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ నటిస్తోన్న పాన్ ఇండియా సినిమా పుష్ప 2 ది రూల్ సుకుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. ఈయేడాది డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఏదో ఒక అప్‌డేట్‌తో నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో అరుదైన రికార్డును ఖాతాలో వేసుకోబోతుందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇంతకీ విషయమేంటంటే.. బన్నీ అభిమానులు వైజాగ్‌లోని సంగం శరత్ థియేటర్‌లో అల్లు అర్జున్ భారీ కటౌట్‌ను రెడీ చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం పెద్ద ఎత్తున కటౌట్‌ను నిర్మిస్తున్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అతిపెద్దది కావడం విశేషం. భారీ కటౌట్‌తో సరికొత్త రికార్డును ఖాతాలో వేసుకుంటుండగా.. ఆ కటౌట్‌ను చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. సీక్వెల్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా మరోసారి శ్రీవల్లిగా సందడి చేయనుంది. ఈ చిత్రంలో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీకి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

